teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 120 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | ఆదివారం | 12 అక్టోబర్ 2025 | పేజీలు : 08 | వెల ₹5


Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## రైతుల సవాళ్ల పరిష్కారంలో నూతన ఆవిష్కరణలు



- రైతుల ముఖాల్లో ఆనందమే మా ప్రాధాన్యత
- దేశ ప్రధాని నరేంద్ర మోడీ
- రైతుల కోసం ఖర్చు చేయడంలో వెనుకాడేది లేదని స్పష్టం

04




రెడ్డి శేఖర్, ఎడిటర్ ఇన్ చీఫ్
తీన్మార్ దినపత్రిక

స.హా చట్టం
సెక్షన్ 4(1)(బీ)

# అమలులో అలసత్వం

## పౌరులకు అదనపు భారం.. అధికారులకు పనిభారం

- అమలులో లోపం.. అనవసరమైన పనిభారం
- మండలం నుంచి జిల్లా కార్యాలయాల వరకు ఇదే పరిస్థితి
- సమాచార హక్కు చట్టం స్ఫూర్తికే భంగం
- సమస్యల పరిష్కారానికి సమాచార కమిషన్ చర్యలు అనివార్యం

ఉచిత సమాచారానికి దరఖాస్తులు.. ఫిర్యాదులు!

02

సమాచార హక్కు చట్టం 2005 భారత ప్రజాస్వామ్యానికి ఒక పారదర్శకమైన పునాదిగా చెప్పవచ్చు. ఈ చట్టం ప్రభుత్వానికి ప్రజలకు మధ్య ఒక వారధిలా పనిచేస్తూ, పాలనలో జవాబుదారీతనాన్ని పెంచింది. ఈ చట్టంలోని అతి ముఖ్యమైన నిబంధనలలో ఒకటి సెక్షన్ 4(1)(B).



## హర్యానా ఏడిజీపీ ఆత్మహత్యపై తెలంగాణ సీఎం దిగ్భ్రాంతి వ్యక్తం

అణగారిన వర్గాలపై దాడులను ఖండించిన సీఎం

.. వివరాలు 2లో



## తెలంగాణలో టీ స్క్వేర్ ఐకానిక్‌గా ఉండాలి

- నవంబర్ చివరికల్లా వీ-హబ్ పనులు ప్రారంభించాలి
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు
- ఏఐ హబ్, టీ స్క్వేర్ పై పోలీస్ కమాండ్ సెంటర్‌లో సమీక్ష

.. వివరాలు 2లో



# తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల కల్లోలం

## 50% లోపే ఎన్నికలు జరపండి - హైకోర్టు తీర్పు

## 25% బీసీ రిజర్వేషన్లకు గ్రీన్ సిగ్నల్


- 17% జనరల్ కేటగిరీకి..
- రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ
- ఈ నెల 16న కేబినెట్ భేటీ.. హైకోర్టు తీర్పుపై చర్చ

హైదరాబాద్, అక్టోబర్ 11 (తీన్మార్ న్యూస్): పాత రిజర్వేషన్ల ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలపై ముందుకు వెళ్లొచ్చని తెలంగాణ హైకోర్టు గత అర్ధరాత్రి ఆర్డర్ కాపీ విడుదల చేసింది. ఇప్పుడు రాష్ట్రంలో ఈ అంశం హాట్ టాపిక్ గా మారింది. 42 శాతం బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్న హైకోర్టు 50 శాతానికి రిజర్వేషన్లు మించకుండా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని స్పష్టం చేసింది. 42 శాతంలో బీసీలకు 25 శాతం రిజర్వేషన్ కేటాయించి మిగతా 17 శాతాన్ని జనరల్ కేటగిరీకి ఇవ్వాలని సూచించింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం

మిగతా 2 లో

# పీఎస్ఎస్‌లో 25 శాతం కొనుగోలు పరిమితిని రద్దు చేయాలి

- ఆర్థిక భారం రాష్ట్రంపై పడుతోంది
- కేంద్రానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల లేఖ
- మొక్కజొన్న, జొన్నలను పీఎస్ఎస్ పరిధిలోకి తీసుకురావాలి
- కేంద్రానికి మంత్రి విజ్ఞప్తి



02

## వేములవాడ లడ్డూ ప్రసాదంపై ఆరోపణల్లో వాస్తవం లేదు

ప్రసాదం తయారీ ఎటువంటి లోపం జరగలేదు : ఈవో
దేవదాయ కమిషనర్‌కు సమగ్ర నివేదిక సమర్పించినట్లు వెల్లడి



02

# బనకచర్ల ప్రాజెక్టు పెను ప్రమాదం

- తెలంగాణ పట్ల కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం
- బీఆర్ఎస్ హెచ్చరికలు నిజమవుతున్నాయ్
- మాజీ మంత్రి బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆరోపణలు



02

## కృష్ణా నది జలాలను వదులుకోవడానికి సిద్ధంగా లేం



- ట్రిబ్యునల్ లో వాదనలు గట్టిగా వినిపిస్తాం
- భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



## తెలంగాణలో పల్స్ పోలియో స్పెషల్ డ్రైవ్

### 6 జిల్లాల్లో నేడు వ్యాక్సినేషన్

- పొరుగు దేశాల్లో కేసుల నేపథ్యంలో కేంద్రం నిర్ణయం
- 0-5 సంవత్సరాల పిల్లలు 17.5 లక్షలకు వ్యాక్సిన్ లక్ష్యం
- తల్లిదండ్రులు సహకరించాలని ఆరోగ్యశాఖ విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబర్ 11 (తీన్మార్ న్యూస్): దేశంలో పోలియో కేసులు జీరోగా ఉన్నప్పటికీ కేంద్రం ప్రత్యేకంగా పల్స్ పోలియో వ్యాక్సినేషన్ డ్రైవ్ చేపడుతోంది. మన దేశంలో పోలియో కేసులు లేకున్నా పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి పొరుగు దేశాల్లో

మిగతా 2 లో

## సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి బహిరంగ లేఖ



- బనకచర్ల ప్రాజెక్టుపై స్పందించిన కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్
- సాధ్యాసాధ్యాలు పరిశీలనలో ఉన్నాయని వెల్లడి
- ఈ ప్రాజెక్టుపై రాష్ట్రాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం

## ఈ నెల 14న రాష్ట్ర బంద్‌కు పిలుపు

హైకోర్టు స్టేపై తీవ్ర అసంతృప్తితో బీసీ సంఘాల నిరసన



హైదరాబాద్, అక్టోబర్ 11 (తీన్మార్ న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై తెలంగాణ హైకోర్టు స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో బీసీ సంఘాలు తీవ్ర అసంతృప్తితో

మిగతా 2 లో



జూబ్లీహిల్స్ బై ఎలక్షన్..

## బీఆర్ఎస్‌కు కొత్త టెన్షన్

ఉప ఎన్నిక బరిలోకి టీఆర్ఎస్-డీ
షురూ కానున్న నామినేషన్ల ప్రక్రియ

.. వివరాలు 4లో

# స.హా చట్టం సెక్షన్ 4(1)(బీ)
# "అమలులో" అలసత్వం




తీన్మార్ దినపత్రిక, అక్టోబర్ 11 (ప్రత్యేక కథనం)

సమాచార హక్కు చట్టం (RTI) 2005 భారత ప్రజాస్వామ్యానికి ఒక పారదర్శకమైన పునాదిగా చెప్పవచ్చు. ఈ చట్టం ప్రభుత్వానికి ప్రజలకు మధ్య ఒక వారధిలా పనిచేస్తూ, పాలనలో జవాబుదారీతనాన్ని పెంచింది. ఈ చట్టంలోని అతి ముఖ్యమైన నిబంధనలలో ఒకటి సెక్షన్ 4(1)(B). ఈ సెక్షన్ ప్రకారం, ప్రజలు అడగకుండానే, ప్రభుత్వ కార్యాలయాలు తమ కార్యకలాపాలకు సంబంధించిన 17 ముఖ్యమైన అంశాలను బహిరంగంగా ప్రదర్శించాలి. దీని ఉద్దేశ్యం స్పష్టంగా ఉంది. పౌరులకు సమాచారం సులభంగా, వేగంగా అందుబాటులోకి తీసుకురావడం. దీనివల్ల పౌరులు సమాచారం కోసం దరఖాస్తులు చేసుకునే సంఖ్య తగ్గి, అధికారుల పనిభారం కూడా తగ్గుతుందని భావించారు.

అయితే, ఈ చట్టం అమలులోకి వచ్చి దాదాపు 20 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితి ఆశాజనకంగా లేదు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో, ఈ సెక్షన్ అమలుపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అనేక ప్రభుత్వ కార్యాలయాలు ఈ నిబంధనను అమలు చేయకపోవడం పారదర్శకతకు ఆటంకం కలిగిస్తోంది.

**అమలులో అలసత్వం... సమస్యల వలయం**


రాష్ట్రంలోని చాలా మండల కార్యాలయాలతో పాటు, జిల్లా కార్యాలయాలు, ఇంకా సగానికి పైగా కలెక్టర్ కార్యాలయాల్లో కూడా ఈ సెక్షన్ అమలు కావడం లేదు. దీనివల్ల ఈ నిబంధనలలోని అంశాలను సైతం పొందాలంటే పౌరులు తమకు అవసరమైన సమాచారం కోసం చట్టంలోని సెక్షన్ 6(1) కింద దరఖాస్తు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. స్వచ్ఛందంగా లభించాల్సిన సమాచారం కోసం కూడా అభ్యర్థనలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

**పౌరులకు అదనపు భారం:**

ఈ పరిస్థితి పౌరులకు అనవసరమైన శ్రమ, కాలయాపన మరియు ఖర్చులను కలిగిస్తోంది. దరఖాస్తు చేయడం, సమాధానం కోసం ఎదురు చూడటం, ఒకవేళ సమాచారం అందకపోతే అప్పీళ్లు, ఫిర్యాదులు చేసుకోవడం వంటి సమస్యల వలయంలో చిక్కుకుంటున్నారు.

**అధికారుల పనిభారం పెరుగుదల:** సెక్షన్ 4(1)(B) సరిగ్గా అమలు చేస్తే తగ్గే పనిభారం, ఇప్పుడు దరఖాస్తులకు సమాధానాలు ఇవ్వడం, అప్పీళ్లకు స్పందించడం ద్వారా మరింత పెరుగుతోంది. దీనివల్ల అప్పీలేట్ అధికారులు, చివరకు రాష్ట్ర సమాచార కమిషన్ పైనా పనిభారం విపరీతంగా పెరిగి, మొత్తం వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోంది.

తక్షణ చర్యలు అవసరం. ఈ సమస్యకు తక్షణ పరిష్కారం కనుగొనడం అత్యవసరం. దీనికి సంబంధించి ప్రభుత్వం మరియు రాష్ట్ర సమాచార కమిషన్ జోక్యం అనివార్యం. కఠిన ఆదేశాలు జారీ చేయాలి: రాష్ట్ర సమాచార కమిషన్ ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి, అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెక్షన్ 4(1)(B)లోని 17 అంశాలను తప్పనిసరిగా బహిరంగంగా ప్రదర్శించాలని కఠినమైన ఆదేశాలు జారీ చేయాలి. పర్యవేక్షణ యంత్రాంగం ఏర్పాటు: ఈ ఆదేశాలు సరిగ్గా అమలవుతున్నాయో లేదో పరిశీలించడానికి ఒక పర్యవేక్షణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. నిబంధనలను ఉల్లంఘించే కార్యాలయాలపై తగిన చర్యలు తీసుకోవాలి.




**అవగాహన కల్పించాలి:** అధికారులకు సెక్షన్ 4(1)(B) ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలి. ఈ సెక్షన్ అమలు చేయడం వల్ల పారదర్శకత పెరగడమే కాకుండా, వారి పనిభారం కూడా తగ్గుతుందని వారికి స్పష్టం చేయాలి. పౌరులకు సమాచారం అందించడంలో మరియు ప్రభుత్వ అధికారుల పనిభారం తగ్గించడంలో ఈ చర్యలు అనివార్యం. నిజమైన పారదర్శకతను సాధించాలంటే, చట్టం యొక్క ఉద్దేశాన్ని గౌరవించి, దానిలోని ప్రతి నిబంధనను చిత్తశుద్ధితో అమలు చేయాల్సిన అవసరం ఉంది. లేకపోతే, సమాచార హక్కు చట్టం యొక్క లక్ష్యం కేవలం కాగితాలకే పరిమితమైపోయే ప్రమాదం ఉంది.

**సెక్షన్ 4(1)(B) ప్రకారం 17 అంశాలు:**

- కార్యాలయం యొక్క విధి విధానాలు, అధికారాలు, మరియు విధులు.
- అధికారులు, ఉద్యోగుల అధికారాలు, విధులు.
- నిర్ణయాలు తీసుకునే విధానంలో అనుసరించే నియమాలు, ప్రక్రియలు.
- కార్యాలయం విధులు నిర్వహించడానికి నిర్దేశించిన నియమాలు, నిబంధనలు, సూచనలు, మాన్యువల్లు మరియు రికార్డులు.
- కార్యాలయం వద్ద లేదా దాని నియంత్రణలో ఉన్న రికార్డుల కేటగిరీలు.
- కార్యాలయం యొక్క వివిధ విభాగాలలో పనిచేసే ఉద్యోగుల పేర్లు, అధికారాలు, మరియు వారి విధుల వివరాలు.
- సమాచారం కోసం సంప్రదించాల్సిన ప్రజా సమాచార అధికారులు (PIO) మరియు అప్పిలేట్ అధికారుల వివరాలు.
- కార్యాలయం ద్వారా అమలు చేయబడే పథకాలు, కార్యక్రమాలు మరియు వాటికి కేటాయించిన నిధుల వివరాలు.
- కార్యాలయం నుండి ప్రయోజనం పొందిన వారి వివరాలు (సబ్సిడీలు, అలవెన్సులు మొదలైనవి).
- వివిధ కార్యక్రమాలు, పథకాల కోసం కేటాయించిన బడ్జెట్ వివరాలు, ఖర్చుల వివరాలు, మరియు వాటి నివేదికలు.
- ఆర్థిక వ్యవహారాల వివరాలు, నిధుల కేటాయింపులు, మరియు ఆడిట్ నివేదికలు.
- కార్యాలయం నిర్వహించే సమావేశాల వివరాలు, వాటిలో తీసుకున్న నిర్ణయాల నిమిషాలు (minuets).
- ప్రజల కోసం అందుబాటులో ఉంచిన సమాచారం వివరాలు, ప్రచురించిన పత్రాల వివరాలు.
- సమాచార హక్కు చట్టం ప్రకారం సమాచారం పొందడానికి అనుసరించాల్సిన విధానం, ఫీజుల వివరాలు.
- ప్రజా సమాచార అధికారి (PIO) వివరాలు.
- ప్రజా సమాచార అధికారి (PIO)కి పంపాల్సిన దరఖాస్తు ఫారం నమూనా.
- ప్రభుత్వ కార్యాలయాలు పారదర్శకంగా, జవాబుదారీగా ఉండటానికి సహాయపడే ఇతర సమాచారం.

# బనకచర్ల ప్రాజెక్టు పెను ప్రమాదం

హైదరాబాద్, అక్టోబర్ 11 (తీన్మార్ న్యూస్): బనకచర్ల ప్రాజెక్టుపై బీఆర్ఎస్ హెచ్చరికలు నిజమవుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. తెలంగాణ పాలిట బనకచర్ల ప్రాజెక్టు పెను ప్రమాదంగా మారబోతోందని ఏపీ ప్రభుత్వం కేంద్రం సహకారంతో బనకచర్లపై ముందుకెళ్తుంటే తెలంగాణ ప్రభుత్వం మాత్రం పట్టించుకోకుండా పరోక్షంగా సహకరిస్తోందని ధ్వజమెత్తారు. శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు బనకచర్ల ప్రాజెక్టును కొనసాగిస్తున్నామని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారన్నారు. వరద జలాలపై ప్రాజెక్టు రిపోర్టులు ఆమోదించకూడదు. కానీ బనకచర్ల ప్రాజెక్టు పీఎఫ్ఆర్ పరిశీలిస్తున్నామని కేంద్రం లేఖ రాస్తే సీఎం రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టుకు వెళ్లకుండా నిద్రపోతున్నారని ధ్వజమెత్తారు. 423 టీఎంసీలు ఏపీ మళ్లించుకుంటోందని కాబట్టి 112 టీఎంసీలు ఆల్మట్టిలో ఆపుకుంటామని కర్ణాటక లేఖ రాసింది. మరో వైపు వరద జలాలతో విదర్భలో ప్రాజెక్టులు కట్టుకుంటామని మహారాష్ట్ర సిద్ధమవుతోంది. ఇంత జరుగుతున్నా సీఎంగా ప్రజాప్రయోజనాలు కాపాడతావా లేక స్వార్థ ప్రయోజనాలు చూసుకుంటావా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు.


# కృష్ణా నది జలాలను వదులుకోవడానికి సిద్ధంగా లేం

హన్మకొండ, అక్టోబర్ 11 (తీన్మార్ న్యూస్): కృష్ణా నది జలాలను వదులుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేదని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని పరామర్శించేందుకు వచ్చిన ఆయన మంత్రి సీతక్కతో కలిసి మీడియాతో మాట్లాడారు. ట్రిబ్యునల్ లో మన వాదనలు గట్టిగా వినిపించనున్నామన్నారు. కృష్ణలో 512 టీఎంసీ నీటిని ఆంధ్ర ప్రదేశ్ కి ఇచ్చేందుకు టీఆర్ఎస్ ఒప్పుకుందని ఆరోపించారు. కాళేశ్వరం ఉత్తగా ఉన్న తెలంగాణలో అత్యధిక వరి పంట పండిందన్నారు. గోదావరి కృష్ణాలో మోసం జరిగిందని టీఆర్ఎస్ నేతలు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఏపీ చేపట్టే బంకచర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకం అని అన్నారు. మంత్రి హోదాలో కృష్ణ ట్రిబ్యునల్ కి హాజరైన ఏకైక మంత్రి నేనే అన్నారు. మన నీటి హక్కులను ఒక చుక్క కూడా వదులుకోమన్నారు. కేంద్రానికి ఇదే విషయం పదే పదే చెప్తామన్నారు. కృష్ణ, గోదావరి నీటి హక్కును కాపాడుకునే చిత్తశుద్ధి తెలంగాణ ప్రభుత్వానికి ఉందన్నారు. ఆల్మట్టి ఎత్తు పెంచడానికి మేము వ్యతిరేకిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే తెలంగాణ రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. హరీష్ రావు తెలంగాణ ప్రభుత్వాన్ని బదనాం చేసే తీరు మార్చుకోవాలన్నారు.

# పీఎస్ఎస్‌లో 25 శాతం కొనుగోలు పరిమితిని రద్దు చేయాలి

హైదరాబాద్, అక్టోబర్ 11 (తీన్మార్ న్యూస్): దేశంలో ఆహార భద్రతను బలోపేతం చేయడానికి, రైతు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం చూపుతున్న సంకల్పాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అభినందించారు. శనివారం పీఎం ధన్ ధాన్య కృషి యోజన, నేషనల్ మిషన్ ఆన్ పల్సెస్ పథకాలను ప్రారంభించిన సందర్భంగా కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు అభినందనలు తెలుపుతూ లేఖ రాశారు. రాష్ట్రంలో అమలవుతున్న మద్దతు ధర పథకం (పీఎస్ఎస్)లో ఉన్న పరిమితులు, ప్రధాన పంటల కొనుగోలుపై కేంద్ర నిర్లక్ష్యం, రైతుల ఆదాయంపై ప్రభావం చూపుతున్న కేంద్ర వాణిజ్య విధానాలపై అభ్యంతరం తెలిపారు. కనీస మద్దతు ధర పథకం కింద కొనుగోలు చేస్తున్న నువ్వులు, శనగలు, వేరుశనగ, సోయాబీన్, పెసళ్ళు వంటి పంటలపై సీలింగ్ విధించడంతో రైతులు తాము పండించిన పంటలో కేవలం 25 శాతం మాత్రమే మద్దతు ధరకు అమ్ముకొనే వెసులుబాటు ఉంటుందన్నారు. మార్కెట్‌లో ధరలు పడిపోయిన సమయంలో రైతుల ప్రయోజనార్థం రాష్ట్ర ప్రభుత్వం మార్క్ ఫెడ్, సహకార సంస్థల ద్వారా కేంద్రం విధించిన 25 శాతం సీలింగ్ కంటే ఎక్కువ కొనుగోళ్లు చేయవలసి వస్తోందని, దీంతో రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

పీఎస్ఎస్ కింద ఉన్న 25 శాతం కొనుగోలు పరిమితిని రద్దు చేయాలని లేకుంటే సడలించాలని కోరారు. వర్షాధార పంటలలో మొక్కజొన్న, జొన్న పంటలు ప్రధానమైనదని ఈ పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించినప్పటికీ, కేంద్రం ద్వారా కొనుగోలు జరగకపోవడంతో రాష్ట్రం తన స్వంత నిధులతో రైతుల నుంచి కొనుగోలు చేసి నష్టపోకుండా చూడాల్సివస్తోందని చెప్పారు. రైతులకు నిర్దేశిత మద్దతు ధర భరోసా కల్పించేందుకు ఈ రెండు పంటలను పీఎస్ఎస్‌పథకం పరిధిలోకి తీసుకురావాలని పేర్కొన్నారు. రైతు కష్టకాలంలో ఉన్నప్పుడు, రైతులకు గిట్టుబాటు ధర అందని సమయాలలో రాష్ట్రం జోక్యం చేసుకొని, కేంద్రం ప్రకటించిన కనిష్ట మద్దతు ధర చెల్లించి రైతులను కాపాడుకోవాల్సి వస్తుందని, కేంద్ర ఆర్థిక మద్దతు లేకుండా ఇది దీర్ఘకాలంగా కొనసాగడం




అసాధ్యం అన్నారు. ఎంఎస్పీ అమలు, మార్కెట్ జోక్యాల్లో కేంద్ర-రాష్ట్రాల మధ్య వ్యయభారం పంచుకునే ఆర్థిక విధానం రూపుదిద్దాలని సూచించారు.

**ఆయిల్ పామ్, పత్తి రైతుల పై వాణిజ్య విధానాల ప్రభావం:**

నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ - ఆయిల్ పామ్ (ఎన్ఎంఈఓ-ఓపీ) పథకం అమలులో తెలంగాణ దేశంలో ముందంజలో ఉందని, ఇప్పటికే 1.08 లక్ష హెక్టార్లలో 73,744 మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని, ఈ ఏడాది మరో 50 వేల హెక్టార్ల విస్తరణ లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కేంద్రం మే 31, 2025న క్రూడ్ పామ్ ఆయిల్‌పై కస్టమ్స్ సుంకాన్ని 27.5 శాతం నుండి 16.5 శాతానికి తగ్గించడంతో దేశీయ ధరలు తీవ్రంగా పడిపోయి, ఆయిల్ పామ్ రైతులు పొందే తాజా ఫ్రూట్ బంచ్ ధర టన్నుకి రూ 20 వేల కంటే తక్కువకు చేరిందన్నారు. పత్తి విషయంలో సీసీఐ కొనుగోళ్లు 50-60 శాతం వరకు మాత్రమే పరిమితం అవుతున్నాయని, నాణ్యత పరమైన కారణాలు, కొనుగోళ్లలో ఆలస్యం కారణంగా రైతులకు మద్దతు ధర లభించడం లేదన్నారు. అంతేకాకుండా కాటన్ దిగుమతులపై దిగుమతి సుంకం మినహాయింపు చేయడంతో కూడా దేశీయ ధరలు మరింతగా పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వాణిజ్య విధానాలు రైతుల ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, ఆయిల్ పామ్ , పత్తిపై దిగుమతి సుంక విధానాలు దేశీయ మార్కెట్ సీజన్‌లకు అనుగుణంగా ఉండేలా ఆర్థిక మంత్రిత్వ శాఖతో సమన్వయం చేయాలని కోరారు.

# తెలంగాణలో "బీసీ" రిజర్వేషన్ల కల్లోలం

మొదటి పేజీ తరువాయి

ఇంతవరకూ స్పందించలేదు. హైకోర్టు ఆదేశాలపై రాష్ట్ర ప్రభుత్వం తదుపరి నిర్ణయం ఏంటన్న దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ అంశంపై సర్కార్ సుప్రీంకోర్టుకు వెళ్తుందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కాగా ఈనెల 16వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ భేటీ జరగనుంది. ఈ సమావేశంలో బీసీ రిజర్వేషన్ల అంశంతో పాటు హైకోర్టు తీర్పుపై కూడా మంత్రివర్గం చర్చించనున్నట్లు తెలుస్తోంది. అలాగే ఇరిగేషన్ ప్రాజెక్టులు, మెట్రో రైల్ రెండో దశ ప్రాజెక్ట్ టెండర్లపై కూడా కేబినెట్ కీలక నిర్ణయం తీసుకోనుంది. మరోవైపు స్థానిక ఎన్నికల నిర్వహణపై రాష్ట్రప్రభుత్వం స్పష్టతనివ్వాలని ఎన్నికల సంఘం విజ్ఞప్తి చేయనున్నట్లు సమాచారం. తాజాగా హైకోర్టు జారీ చేసిన ఆర్డర్ కాపీపై ఎన్నికల సంఘం న్యాయనిపుణులతో చర్చిస్తోంది.

# వేములవాడ లడ్డూ ప్రసాదంపై ఆరోపణల్లో వాస్తవం లేదు

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 11 (తీన్మార్ న్యూస్): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో లడ్డూ ప్రసాదంపై ఆరోపణల్లో వాస్తవం లేదని దేవస్థానం ఈవో రమాదేవి తెలిపారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు దేవదాయ కమిషనర్‌కు సమగ్ర నివేదిక సమర్పించినట్లు ఆమె శనివారం పేర్కొన్నారు. లడ్డూ ప్రసాదం తయారీ ఎక్కడా ఎటువంటి లోపం జరగలేదని, భక్తుల మనోభావాలను గౌరవించే ప్రక్రియలో భాగంగా కీలక చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. శుక్రవారం 11 గంటల సమయంలో ప్రసాద విక్రయాల వద్ద లడ్డూ ప్రసాదంలో బూజు పట్టినట్లు ప్రచారం జరిగిందని వెల్లడించారు. విషయం తెలిసిన వెంటనే విచారణ చేపట్టామని తెలిపారు. ప్రసాదం ఖరీదు చేసిన భక్తులను ప్రసాదం నాణ్యత విషయంలో విచారించగా లడ్డూ, పులిహోర ప్రసాదాలు నాణ్యతతో ఉన్నాయని తెలిపారని పేర్కొన్నారు. ఈ ఘటనపై అదే సమయంలో ఇతర భక్తులెవరూ ఫిర్యాదు చేయలేదని వెల్లడించారు. స్వామి వారి లడ్డూ ప్రసాదం విషయంలో అవాస్తవాలను ఎవరూ నమ్మొద్దని తెలిపారు. ఈ ఘటనపై దేవాదాయ శాఖ మంత్రి ఫోన్ ద్వారా సంప్రదించి ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించేలా దుష్ప్రచార చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లుగా ఈవో రమాదేవి మీడియాకు తెలిపారు.

# హర్యానా ఏడిజీపీ ఆత్మహత్యపై తెలంగాణ సీఎం దిగ్భ్రాంతి వ్యక్తం

హైదరాబాద్, అక్టోబర్ 11 (తీన్మార్ న్యూస్): హర్యానా అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, సీనియర్ ఐపీఎస్ అధికారి వై. పూరన్ కుమార్ ఆత్మహత్యపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించిన సీఎం రేవంత్, ఒక ఐపీఎస్ అధికారి కూడా కుల వివక్షకు గురై ప్రాణాలు తీసుకోవాల్సిన పరిస్థితి రావడం, సమాజంలో కుల ఆధారిత ద్వేషం ఎంత పెరిగిందో చూపిస్తున్న దారుణ ఉదాహరణ అని పేర్కొన్నారు. ఎడీజీపీ స్థాయి అధికారి కూడా వేధింపులకు గురైతే, సాధారణ ప్రజల పరిస్థితి ఎంత విషమంగా ఉందో అర్థమవుతుంది అని సీఎం తెలిపారు. ఇలాంటి సంఘటనలు సమాజంలో విషాన్ని వ్యాప్తి చేస్తున్నాయని, ఇవి రాజ్యాంగం, సమానత్వం, న్యాయంపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కుల వివక్షకు వ్యతిరేకంగా బలమైన సామాజిక చైతన్యం అవసరమని వివరించారు. అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులను అందరూ తీవ్రంగా ఖండించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇది కేవలం ఐపీఎస్ అధికారి పూరణ్ కుమార్‌పై దాడి కాదు. దేశంపైనే దాడి ఇలాంటి సంఘటనలను ప్రతి ఒక్కరూ తీవ్రంగా పరిగణించాలి అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వై. పూరణ్ కుమార్ కుటుంబ సభ్యులకు తన గాఢ సానుభూతిని తెలియజేసిన సీఎం రేవంత్ రెడ్డి. వ్యక్తి సామాన్యుడైనా, ఉన్నతస్థాయి అధికారి అయినా, దళిత వర్గానికి చెందిన వారైనా, అన్యాయం, అమానవీయత ఏ రూపంలోనైనా సహించరాదు అని ముఖ్యమంత్రి తెలిపారు.

## తెలంగాణలో 'టీ స్క్వేర్' ఐకానిక్‌గా ఉండాలి

హైదరాబాద్, అక్టోబర్ 11 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఐకానిక్‌గా టీ స్క్వేర్ నిర్మాణం ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులకు సూచించారు. నవంబర్ నెల చివరి వరకు వి-హబ్ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. శనివారం హైదరాబాద్ పోలీస్ కమాండ్ సెంటర్‌లో ఏఐ హబ్, టీ స్క్వేర్ పై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి శ్రీధర్‌బాబు, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేశ్‌రంజన్, సంజయ్‌కుమార్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, టీజీఐఐసీ ఎండీ శశాంక, టీఫైబర్ ఎండీ వేణుప్రసాద్, ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వి-హబ్ ఐకానిక్ బిల్డింగ్‌గా ఉండాలని సీఎం సూచించారు. వి హబ్ నిర్మాణం కోసం జైకా ఫండ్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని, దీని నిర్మాణంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, వి హబ్‌లో ఆపిల్ లాంటి ఇంటర్నేషనల్ బ్రాండ్స్ తమ ఔట్‌లెట్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. యుటిలిటీ జోన్ ఏర్పాటు చేయాలని, వి హబ్ 24 గంటల పాటు పనియాలన్నారు. ఏఐ హబ్ తాత్కాలిక ఏర్పాటు కోసం ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్‌లో భవనాలను పరిశీలించాలని సూచించారు. ఏఐ హబ్ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలని, ఇందు కోసం ప్రపంచ ప్రసిద్ధిగాంచిన సంస్థల ప్రతినిధులతో బోర్డు ఏర్పాటు చేయాలన్నారు.

# తెలంగాణలో పల్స్ పోలియో స్పెషల్ డ్రైవ్

మొదటి పేజీ తరువాయి

కేసులు నమోదు అవుతుండటంతో కేంద్రం అప్రమత్తమైంది. పల్స్ పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. ఇందుకోసం దేశవ్యాప్తంగా 290 జిల్లాలను ఎంపిక చేయగా, అందులో మన రాష్ట్రం నుంచి 5 జిల్లాలు (హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, హన్మకొండ) ఉన్నాయి. ఈ ఐదు జిల్లాలతోపాటు వరంగల్ జిల్లా పరిధిలోని పట్టణ ప్రాంతంలోనూ వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ ఈరోజు నిర్వహించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఈ 6 జిల్లాల పరిధిలో 0-5 సంవత్సరాల వయసు పిల్లలు 17,56,789 మంది ఉన్నట్టు అధికారులు అంచనా వేశారు. వీరందరికీ స్పెషల్ డ్రైవ్‌లో ఆదివారం పోలియో వ్యాక్సిన్ వేయనున్నారు. అప్పుడే పుట్టిన శిశువుల దగ్గర్నుంచి, 5 సంవత్సరాల వయసున్న పిల్లలందరికీ వ్యాక్సిన్లు వేయించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

# ఈ నెల 14న రాష్ట్ర బంద్‌కు పిలుపు

మొదటి పేజీ తరువాయి

ఉన్నాయి. ఇందుకు నిరసనగా బీసీ నేత, ఎంపీ ఆర్. కృష్ణయ్య ఈ నెల 14న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో భేటీ అయ్యారు. అనంతరం కృష్ణయ్య మీడియాతో మాట్లాడుతూ లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ జీవోపై హైకోర్టు స్టే ఇవ్వడం, ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసనలు చేస్తామని తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 14న తెలంగాణ బంద్ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అన్ని బీసీ సంఘాల మద్దతుతో బంద్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అందరూ కలసి బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీలు, కుల సంఘాలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ విషయమై బంద్‌కు బీజేపీ మద్దతు ఇవ్వాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కోరినట్లు చెప్పారు. దీనిపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి చెప్పారని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత కోర్టులు జోక్యం చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు.

# 42శాతం బీసీ రిజర్వేషన్లకై ఎంపీలు రాజీనామా చెయ్యాలి

మల్లంపల్లి మండల యూత్ ప్రెసిడెంట్ మొర్రిరాజుయాదవ్



మల్లంపల్లి, అక్టోబర్ 11(తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలో బీసీల ఆత్మగౌరవంతో చెలగాటమాడుతుంది కాంగ్రెస్ బిజెపి పార్టీలు ఒకరు రాష్ట్రంలో అధికారంలో ఉంటే ఇంకొకరు కేంద్రంలో అధికారంలో ఉన్నారు. ఈరోజు కాంగ్రెస్ పార్టీ బిజెపి పార్టీని అడగాల్సిందిపోయి ప్రతిపక్ష పార్టీగా ఉన్న బిఆర్ఎస్ పార్టీని అనడం చాలా హేయమైన చర్య. ఈరోజు కాంగ్రెస్ పార్టీకి బిజెపి పార్టీలకు బీసీలపై చిత్తశుద్ధి ఉంటే కేంద్రంపై తెలంగాణ బిజెపి ఎంపీలుఒత్తిడి తీసుకొచ్చి 9 షెడ్యూల్లో చేర్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కలిపించడంకోసం కోసం 16 మంది ఎంపీలు రాజీనామా చేయాలి. కేంద్రంలో 8 కాంగ్రెస్ పార్టీ ఎంపీలు 8 బిజెపి పార్టీ ఎంపీ కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావలసింది పోయి ఒకరిని ఒకరు దూషించుకుంటూ బీసీలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. అసంపూర్ణమైన జీవోలు తీసుకువచ్చి బీసీలను అయోమయం చేసే ప్రయత్నం చేస్తున్నారు. బిఆర్ఎస్ పార్టీగా మా నాయకులు అసెంబ్లీలో బీసీ బిల్లుకు మద్దతు తెలిపిన విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ఎట్లా విస్మరించి మా పార్టీ పై ఏలా నిందలు వేస్తుందో చెప్పాలి.అసెంబ్లీ లో బీసీ బిల్లు ప్రవేశపెట్టిన రోజునే మా నాయకులు అసమగ్రంగా జీవోలు తీసుకువచ్చి బీసీలను మోసపూర్చే చర్యలు చేయవద్దని బీసీల రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 9వ షెడ్యూల్లో చేర్చేలా కృషి చేసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.లేకుంటే ఈ అసమగ్రమైన బిల్లు కోర్టుల్లో నిలపడదని మా నాయకులు అసెంబ్లీ సాక్షిగా ఆనాడే చెప్పారని అన్నారు. బీజేపీ పార్టీకి 08 ఎంపీ సీట్లు ఇస్తే ఇవ్వాలా కాంగ్రెస్ పార్టీ నాయకులు బిజెపి నాయకులను అడగాల్సింది పోయి బిఆర్ఎస్ పార్టీని మద్యలోకి లాగి మా పార్టీ వల్లనే రిజర్వేషన్ల బిల్లు ఆగిందని అనడం అంటే ఆడలేక పందిరి కురుస అన్నట్టుగా ఉంటుంది అన్నారు. ఈ రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్,బీజేపీ ఎంపీలు బీసీ బిల్లును 9వ షెడ్యూల్లో చేర్చకపోతే మూకుమ్మడిగా రాజీనామాలకు సిద్ధపడాలి.అప్పుడే వారికి బీసీలకు రిజర్వేషన్ల పట్ల చిత్తశుద్ధి ఉందని తెలంగాణ ప్రజలు నమ్ముతారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర బూచిగా చూపెట్టి ఇతర రాష్ట్రాల్లో పబ్బం గడపడం కోసం బీసీల ఆత్మగౌరవంతో చెలగాటం ఆడుకుంటున్నారు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు సాధించడానికి బిఆర్ఎస్ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ఉంటుంది.బీసీలను మోసం చేయాలని చూస్తేసహించేది లేదు. బీసీ రిజర్వేషన్ల కోసం ఎక్కడిదాకనైనా పోరాడుతామని ఈసందరంగా మొర్రి రాజు యాదవ్ అన్నారు.

# కుల వివక్షతోనే దళిత ఐపీఎస్ ఆత్మహత్య: మాయావతి

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 11 (తీన్మార్ న్యూస్): హర్యానాలో సీనియర్ దళిత పోలీసు అధికారి వై. పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకున్న ఘటన దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు కుమారి మాయావతి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన భార్య అమ్నీత్ కుమార్ హర్యానా కేడర్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారిణి కూడా కావడం ఈ ఘటనను మరింత విషాదంగా మార్చిందని తెలిపారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ,మైనారిటీలపై కుల వివక్ష, వేధింపులు ఇప్పటికీ తీవ్రంగా కొనసాగుతున్నాయనే దానికి ఈ సంఘటన మరోసారి రుజువు చేసిందని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలతో దేశవ్యాప్తంగా దళితుల్లో తీవ్ర ఆందోళన, ఆవేదన, నిరాశ నెలకొన్నదని చెప్పారు.

పాలనా వ్యవస్థలో కులతత్వం ఎంత లోతుగా వేర్లునుకుందో, అధిపత్య పాలకులు, ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం ఇలాంటి ఘటనలు అరికట్టడంలో ఏ విధంగా విఫలమవుతున్నాయో ఇది రుజువు చేస్తోందని ఆమె పేర్కొన్నారు.ఈ సంఘటనపై సీబీఐతో దర్యాప్తు జరుపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కుల వివక్షపై ఆరోపణలు బయటపడుతుండటం దర్యాప్తును పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరపాల్సిన అవసరం ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు ఈ ఘటనను సామాజిక న్యాయం కోణంలో, అత్యంత సీరియస్‌గా పరిగణించాలని అభిప్రాయపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లపై నిత్యం అనుచిత వ్యాఖ్యలు చేసే అధిపత్య వర్గాలు ఈ సంఘటన నుండి పాఠం నేర్చుకోవాలని హితవు పలికారు. ఎందుకంటే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన వారు విద్య, ఉద్యోగ పరంగా, ఆర్థికంగా ఎంత ఎత్తుకు ఎదిగినా, రాజకీయంగా ఉన్నత పదవులు చేపట్టినా కులం వారిని నిరంతరం వెంటాడుతుందని, కుల పేరుతో దౌర్జన్యాలు, అణచివేతలు ఈ వర్గాలపై అన్ని స్థాయిలలో కొనసాగుతూనే ఉన్నాయదనానికి ఈ ఘటనతోరుజువైందని ఆమె స్పష్టం చేశారు.

# అంతిమయాత్ర పాల్గొన్న సోదా రామకృష్ణ



పరకాల, అక్టోబర్ 11 (తీన్మార్ న్యూస్): పరకాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి తల్లిగారైన కీ,శే, రంగమ్మ అనారోగ్యంతో మరణించగా వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి అంతిమయాత్రలో పాల్గొన్న పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ, మాజీ కౌన్సిలర్స్ పంచగిరి జయమ్మ,నల్లెల్ల అనిల్ కుమార్, ఏకు రాజు, అడప రాము తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామానికి ప్రణాళిక ఉంటేనే అభివృద్ధి సాధ్యం

**రానున్న రోజుల్లో మున్సిపాలిటీ ఏర్పాటు**
**ఏటూరు నాగారం ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం**
**కోటి రూ. నిధులతో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన**
**రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)**



ఏటూరు నాగారం, అక్టోబర్ 11 (తీన్మార్ న్యూస్): గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే మాస్టర్ ప్లాన్ తయారు చేసుకోవాలని, మాస్టర్ ప్లాన్ ద్వారానే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం ఏటూరు నాగారం మండల కేంద్రంలో ఒక కోటి రూపాయల నిధులతో నిర్మించనున్న వెజ్ మరియు నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణ పనులను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఏటూరు నాగారం ప్రాంతం గతంలో చిన్న పల్లె టూరిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిందని ప్రస్తుత కాలంలో రెవెన్యూ డివిజన్ గా, 5 మండలాలకు కేంద్రంగా రెండు రాష్ట్రాలకు సరిహద్దుగా, ప్రధాన కేంద్రంగా నిలిచిందని, దీనిని దృష్టిలో ఉంచుకొని మండల కేంద్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. ఏటూరు నాగారం కేంద్రంగా ఉండటంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి అనేకమంది ప్రజలు తమ రోజువారి అవసరాల కోసం ఈ ప్రాంతానికి వస్తున్నారని ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కూరగాయల మార్కెట్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

గతంలో ఏటూరు నాగారం ములుగు రెండు ప్రాంతాల మధ్య బస్సు డిపో విషయంలో సమస్య తలెత్తిందని ఈ విషయంపై సంబంధిత అధికారులతో రవాణా శాఖ మంత్రితో చర్చించి ఏటూర్ నాగారం ప్రాంతంలో బస్ డిపో ఏర్పాటు చేస్తున్నామని, ములుగు ప్రాంతంలో బస్ డిపో ఏర్పాటు చేయడం ద్వారా కేవలం బస్సులు ములుగు ప్రాంతానికి వచ్చి హన్మకొండకు తిరుగు ప్రయాణం అవుతాయని, ఏటూరు నాగారం లో బస్ డిపో నిర్మాణం చేయడం ద్వారా ప్రతి బస్సు ఏటూరు నాగారం రావడం ద్వారా చుట్టుపక్కల ఉన్న ఐదు మండలాలకు ఇక్కడి ప్రజలకు ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుందని ఏడున్నర కోట్ల రూపాయలతో ఇక్కడ బస్ డిపో ఏర్పాటు కు శంకుస్థాపన చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఏటూరు నాగారం నుంచి గోదావరి నది వరకు రెండున్నర కోట్ల రూపాయలతో సీసీ రోడ్డు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అందరి సహకారంతో ఏటూరు నాగారం ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయడం జరుగుతుందని, రానున్న రోజులలో మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏటూరునాగారంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా వెజ్ మరియు నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని దానికి సంబంధించిన నిర్మాణ పనులకు ఈరోజు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు.

జిల్లాలో ములుగు, ఏటూర్ నాగారం టౌన్ కేంద్రాలుగా ఉన్నాయని ఈ కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని దానిలో భాగంగానే ఏటూరు నాగారం లో వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం కోసం గత ఎనిమిది నెలల ప్రయత్నాలు చేసి చివరికి వెజ్ నాన్ వెజ్ మార్కెట్కు నేడు శంకుస్థాపన చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. రాబోయే రోజుల్లో పూర్తిస్థాయిలో గ్రౌండ్, స్విమ్మింగ్ పూల్ వంటి అభివృద్ధి పనులను చేపడతామని అన్నారు. స్థానిక మంత్రి ధనసరి అనసూయ సీతక్క చొరవతో సింగరేణి సంస్థ నుంచి ప్రత్యేక నిధులతో ఈ మార్కెట్ నిర్మాణం చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈ ఈ అజయ్ కుమార్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ధ్యేయం

**గుత్తి కోయ గూడల్లో ప్రాథమిక పాఠశాల భవనాల ప్రారంభోత్సవం**
**రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క)**



ఎస్.ఎస్. తాడ్వాయి, అక్టోబర్ 11 (తీన్మార్ న్యూస్): నాణ్యమైన విద్యను అందించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం అని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం ములుగు జిల్లా ఎస్.ఎస్. తాడ్వాయి మండలం లోని కొండపర్తి క్రాస్ చేన్నాపురం తోగు వద్ద 3 లక్షల నిధులతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనంను, లవ్వల స్టేజి జలగలంచ వద్ద 3 లక్షల నిధులతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనంను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఐటిడిఏ పి.ఓ. చిత్ర మిశ్రా, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి లతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జలగలంచ, చేన్నాపురం తోగు గుత్తి కోయ గూడెం రిజర్వ్ ఫారెస్ట్ లో ఉండటం ద్వారా కొన్ని సమస్యలు ఉత్పన్నమవు తున్నాయని అయినప్పటికీ గుత్తి కోయ పిల్లలకు చదువు అందించాలనే ముఖ్య ఉద్దేశంతో ప్రాథమిక పాఠశాలలను నిర్మించి ప్రారంభించడం జరిగిందని తెలిపారు. త్వరలోనే అందరికీ సోలార్ లైట్స్ ఏర్పరచడం జరుగుతుందని దాదాపు ఈ 53 గుత్తి కోయ హాబిటేషన్లో సర్వే నిర్వహించి సోలార్ విద్యుత్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. జలగలంచ ప్రాంతం రహదారికి పక్కనే ఉన్నందున పిల్లల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని పిల్లలను ఎట్టి పరిస్థితుల్లో రోడ్డు వైపు వెళ్ళనివ్వకుండా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు.

ఈ పాఠశాలల ఏర్పాటులో సహకరించిన జిల్లా అధికారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. అనంతరం గుత్తి కోయ చిన్నారులతో మంత్రి ముచ్చటించడంతో చిన్నారుల్లో ఉత్సాహం ఉప్పొంగింది. ఈ కార్యక్రమంలో డి పి ఓ దేవ్ రాజ్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంజెపి పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ సత్య శారద



వరంగల్ జిల్లా, అక్టోబర్ 11 (తీన్మార్ న్యూస్): దుగ్గొండి మండలంలోని గిర్నిబావిలో గల మహాత్మ జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల వసతి సదుపాయాలు, విద్యార్థులకు అందుతున్న భోజనం, తరగతుల నిర్వహణ, హాజరు పట్టికలు, విద్యా ప్రమాణాలు, శుభ్రత వంటి అంశాలను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి వారి అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకున్నారు. వసతి గదులు, డైనింగ్ హాల్, తరగతి గదులు, మరుగుదొడ్ల పరిస్థితులు గురించి అడిగి వివరాలు తీసుకున్నారు.

విద్యార్థులకు మంచి భోజనాన్ని వంట సరుకులను ఎప్పటికప్పుడు పండ్లు కూరగాయలు తాజాగా ఉండాలి వంటగది పాఆయిల్ పప్పు వంటకు సంబంధించినవి నాణ్యతను ఉండేలా చూడాలని అన్నారు.భోజన నాణ్యతను పరిశీలించి ప్రతిరోజుమెనూ కచ్చితంగా పాటించాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి కలెక్టర్ మధ్యాహ్నం భోజనం చేశారు. వసతి గృహంలో అమర్చిన ఫిర్యాదుల పెట్టెను తెరచి ఫిర్యాదులను పరిశీలించారు.

సైన్స్ ల్యాబ్ కావాలని విద్యార్థులు కోరగా వెంటనే ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉండుటకు చదువుతోపాటు క్రీడలు కూడా ఆడాలని, విద్యార్థుల కొరకు బాస్కెట్బాల్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా బీసీ సంక్షేమ అధికారి పుష్పలత, మండల ప్రత్యేక అధికారి జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాసరావు తాహసిల్దార్, ప్రిన్సిపాల్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# గురుకులాల సమస్యల పరిష్కారానికి కీలక నిర్ణయం

## హాస్టళ్లలో ఆహార, మెడికల్ చెక్‌ప్‌లపై ప్రత్యేక పర్యవేక్షణ

## ప్రతి వారం ఇన్‌స్పెక్షన్‌ల నిర్వహణకు చర్యలు

## ఉన్నతాధికారులకు నివేదికలు పంపే విధంగా ప్రణాళిక





హైదరాబాద్, అక్టోబర్ 11 (తీన్మార్ న్యూస్): గురుకులాల సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ కీలక నిర్ణయం తీసుకున్నారని, హాస్టళ్లలో ఆహార నాణ్యత, మెడికల్ చెక్‌ప్‌లు, సానిటేషన్‌పై ప్రత్యేక పర్యవేక్షణ, ప్రతి వారం ఇన్‌స్పెక్షన్‌లు నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపే విధంగా చర్యలు చేపట్టామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిని డిజిటల్‌గా మానిటర్ చేసే ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటవుతుందని, సీఎం దూరదృష్టితో గురుకులాల్లో అత్యవసర ఇబ్బందుల పరిష్కారం కోసం రూ.60 కోట్లు అత్యవసర నిధులు విడుదల చేశారన్నారు. శనివారం తెలంగాణ సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ సీఎం విడుదల చేసిన నిధులతో హాస్టళ్లలో ఎదురయ్యే చిన్నచిన్న సమస్యలకు తక్షణ పరిష్కారం సాధ్యమవుతుందని, పెండింగ్ లో ఉన్న బకాయిలను సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి వారి సహకారంతో ఈ నెల 20 లోపు, మిగిలిన బిల్లులు ఈ నెల చివరిలోగా క్లియర్ చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీ వెల్ఫేర్ సొసైటీలకు కలిపి నిధులు కేటాయించడం సీఎం అంకితభావానికి నిదర్శనమన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి సొసైటీ స్థాయిలో పబ్లిక్ గ్రీవెన్స్ సిస్టమ్ ఏర్పాటు చేశామని, జిల్లా కలెక్టర్ల సమన్వయంతో సొసైటీ స్థాయిలో చర్యలు తీసుకునే వీలు ఉంటుందన్నారు. స్పీడ్ రెస్పాన్స్- ట్రాకింగ్ సిస్టమ్ ఏర్పాటుతో ప్రతి సొసైటీ సెక్రటరీకి నిధుల వినియోగంపై పూర్తి అధికారం ఇచ్చారని, తాము అధికారం చేపట్టిన తర్వాత విద్యార్థులు 71,044 సంఖ్య పెరిగిందని, 3,931 మంది అదనంగా చేరారన్నారు. ప్రస్తుతం గురుకులాల్లో మొత్తం 3.27 లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నారని అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చెప్పారు.

**ఎస్సీ గురుకులాల అభివృద్ధి.**

ఎస్సీ గురుకులాల్లో ఇంటర్‌లో 62,334 మంది, డిగ్రీలో 8,710 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, విద్యార్థుల మెస్ ఛార్జీలు, కాస్మెటిక్ చార్జీలు పెంచడంతో ప్రభుత్వానికి అదనంగా రూ.46,438.84 లక్షలు భారం పడుతుందని మంత్రి తెలిపారు. మెస్ చార్జీల భారం రూ.39,520.24 లక్షలు, కాస్మెటిక్ ఛార్జీల భారం రూ.6,918.60 లక్షలు సంక్షేమంపై ఎంత భారం పడినా ఆ కుటుంబాలకు భరోసా, అండగా నిలుస్తున్నామని మంత్రి లక్ష్మణ్‌కుమార్‌చెప్పారు.

**చిల్లర రాజకీయాలతో విద్యార్థుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు**

బీఆర్ఎస్ హయాంలో శాశ్వత భవనాల నిర్మాణం జరగలేదని, తాము వచ్చాక బాచుపల్లి, గొల్లపల్లి (జగిత్యాల) ప్రాంతాల్లో కొత్త భవనాల నిర్మాణం ప్రారంభమైందన్నారు. విద్యార్థుల భోజనం, వసతి, పరిశుభ్రత, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఆహారం నాణ్యతలేమిపై రాత్రంతా మెస్‌లో జాగారం చేశారని, అప్పుడు ఒక్క మంత్రి కూడా అక్కడకు వెళ్లలేదని మంత్రి విమర్శించారు. వారు ఇప్పుడు మాపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని మంత్రి మండిపడ్డారు. మేమే రాజులం, మేమే మంత్రులం అంటూ దశాబ్దం పాటు వారు ఈ రెండు శాఖలను పూర్తిగా విస్మరించారు అని మంత్రి మండిపడ్డారు.

**సివిల్ సర్వీసుల్లో గురుకులాల ప్రతిభ**

2024 సివిల్స్ ప్రిలిమ్స్‌లో 24 మంది, మెయిన్స్‌లో 3 మంది సెలక్ట్ అయ్యారని మంత్రి చెప్పారు. 2025 లో 26 మంది విద్యార్థులు సివిల్స్ ప్రిలిమినరీలో క్వాలిఫై అయ్యారన్నారు. ఇండియన్ ఫారిన్ సర్వీసెస్ ప్రిలిమినరీలో 5 మంది విద్యార్థులు విజయం సాధించారన్నారు. గ్రూప్-1 (2024-25): 33 మంది, గ్రూప్-4: 145 మంది, DSC: 123 మంది, మొత్తం 186 మంది రాష్ట్ర-కేంద్ర సర్వీసులకు ఎంపికయ్యారని మంత్రి తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణ గురుకులాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తాయని మంత్రి లక్ష్మణ్‌కుమార్‌చెప్పారు. మీ పాఠశాలలో చదివే పేద విద్యార్థుల పట్ల యాజమాన్యాలు మానవతా దృక్పథంతో ఆలోచించి విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాధాన్యం ఇవ్వాలని బెస్ట్ అవైలబుల్ స్కూల్ మేనేజ్మెంట్ లకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

# జూబ్లీహిల్స్ బై ఎలక్షన్.. బీఆర్ఎస్‌కు కొత్త టెన్షన్




హైదరాబాద్, అక్టోబర్ 11 (తీన్మార్ న్యూస్): జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానంలో ఉప ఎన్నికకు నగారా మోగింది. సోమవారం నుంచి ఇక్కడ నామినేషన్ల ప్రక్రియ షురూ కాబోతోంది. ఈ స్థానాన్ని తమ ఖాతాలో వేసుకునేందుకు అధికార కాంగ్రెస్, బీజేపీలు ప్రణాళికలు ఎలా ఉన్నా తమ సిట్టింగ్ స్థానమైన జూబ్లీహిల్స్ ను చేజారకుండా కాపాడుకోవాలని బీఆర్ఎస్ గట్టి ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఉప ఎన్నికలో సత్తా చాటడం ద్వారా రాష్ట్ర రాజకీయాల్లో తమ వెయిట్ అండ్ స్ట్రెంత్ తగ్గలేదని నిరూపించుకోవడం కారు పార్టీకి అనివార్యంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో బీఆర్ఎస్‌కు టీఆర్ఎస్ రూపంలో ఓ షాకింగ్ న్యూస్ రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. జూబ్లీహిల్స్ బై ఎలక్షన్ బరిలో నిలిచేందుకు తెలంగాణ రక్షణ సమితి డెమోక్రటిక్ (టీఆర్ఎస్-డి) రెడీ అంటోంది. ఇదే జరిగితే తమకు బీఆర్ఎస్‌కు ఏ మేరకు డ్యామేజ్ కాబోతోందనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.

**అభ్యర్థిగా మహిళా నేత**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ (డీ) పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు నరాల సత్యనారాయణ తెలిపారు. శనివారం బషీరబాగ్ ప్రెస్ క్లబ్లో పార్టీ జెండాను, వెబ్‌సైట్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆశయాలకు ఆకాంక్షలకు అనుగుణంగా లోగో రూపకల్పన చేశామని చెప్పారు. టీఆర్ఎస్ (డీ) నూతన జెండా తెలంగాణ ప్రతిబింబాన్ని తెలియజేస్తుందని తెలిపారు. జూబ్లీహిల్స్ లో తమ పార్టీ అభ్యర్థిగా టీఆర్ఎస్-డి వర్కింగ్ ప్రెసిడెంట్ కంచర్ల మంజూష పోటీ చేయబోతున్నారని ప్రకటించారు. ఈ ఉపఎన్నికలో మా పార్టీ గట్టి పోటీ ఇవ్వబోతోందని ధీమా వ్యక్తం చేశారు.

**బీఆర్ఎస్ కు టెన్షన్ తప్పదా?:**

ఈ ఎన్నికను చాలెంజ్ గా తీసుకున్న బీఆర్ఎస్‌కు టీఆర్ఎస్-డీ పోటీ ఎలాంటి ఎఫెక్ట్ చూపబోతోందని అనేది ఆసక్తిగా మారింది. క్షేత్రస్థాయి ఓటర్లలో బీఆర్ఎస్ కంటే టీఆర్ఎస్ అనేదే ఎక్కువ మందికి తెలిసిన పేరు కావడం టీఆర్ఎస్-డీ జెండా రంగు సైతం దాదాపు బీఆర్ఎస్‌ను పోలిన గులాబీ రంగు ఉండటం హాట్ టాపిక్ గా మారింది. చిన్న పార్టీలే కదా అని తక్కువ అంచనా వేస్తే గతంలో బీఆర్ఎస్ పార్టీ భారీ మూల్యం చెల్లించుకున్న పరిస్థితులు చాలా ఉన్నాయి. గతంలో కారు గుర్తును పోలి ఉన్న రోడ్డు రోలర్ & రోటీ మేకర్ సింబర్స్ గులాబీ పార్టీని గుబులు పెట్టించింది. కొన్ని స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థుల ఓటమికి కారణం అయిన హిస్టరీ సైతం ఉంది. ఈ నేపథ్యంలో రాబోయే జూబ్లీహిల్స్ బై పోల్ లో సింబల్స్ టెన్షన్ అలా ఉంచితే ఇప్పుడు ఒకే రకమైన రంగుతో తమ పార్టీ పాత పేరుతో టీఆర్ఎస్-డీ బరిలోకి రాబోతుడటం బీఆర్ఎస్ పార్టీపై ఎలాంటి ప్రభావం చూపబోతోంది అనేది వేచి చూడాలి.

# బిర్లా సైన్స్ సెంటర్‌లో స్టెగోడాన్ ఏనుగు శిలాజాలు

## 110 లక్షల ఏళ్ల నాటి స్టెగోడాన్ ఏనుగు దంతాల ప్రదర్శన

## సైన్స్ సెంటర్‌లో సింగరేణి పెవిలియన్ ప్రారంభం



తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 11 (తీన్మార్ న్యూస్): సింగరేణి మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని తవ్వకంలో సందర్భంగా లభ్యమైన 110 లక్షల ఏళ్ల నాటి స్టెగోడాన్ జాతి ఏనుగు దంతాల అవశేషాలు, డైనోసార్ కాలానికి చెందిన శిలాజ కలపను పొందుపరుస్తూ బిర్లా సైన్స్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సింగరేణి పెవిలియన్ ను శనివారం సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, జి.పి. బిర్లా పురావస్తు, ఖగోళ మరియు వైజ్ఞానిక సంస్థ ఛైర్‌పర్సన్ నిర్మల బిర్లా ప్రారంభించారు. నాలుగేళ్ల క్రితం రామగుండం-1 ఏరియాలో మేడిపల్లి ఓపెన్ కాస్టు గనిలో మైనింగ్ కార్యకలాపాలు జరుపుతున్న సందర్భంగా రెండు భారీ ఏనుగు దంతాలు, దవడ ఎముకలు శిలాజ రూపంలో లభ్యమయ్యాయని సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. ఇది గోదావరి పరివాహక ప్రాంతంలో 110 లక్షల సంవత్సరాల క్రితం సంచరించిన అనంతరం అంతరించిపోయిన స్టెగోడాన్ జాతికి చెందిన ఏనుగు అవశేషాలుగా శాస్త్రజ్ఞులు గుర్తించారని, చరిత్ర పూర్వ యుగానికి చెందిన ఈ అవశేషాలను ప్రజలు, విద్యార్థులు వీక్షించడానికి అనువుగా ప్రతిష్టాత్మకమైన బిర్లా సైన్స్ సెంటర్లో ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందని సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథమైన ఆలోచనను కలిగించేందుకు విశేషమైన కృషి చేస్తున్న బిర్లా సైన్స్ సెంటర్ కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. దేశం కోసం బిర్లా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విజ్ఞాన కేంద్రాలు విద్యార్థుల మేథో శక్తిని పెంచడానికి దోహదపడుతున్నాయన్నారు. ప్రాచీన కాలంనాటి అవశేషాలతో నాటి చరిత్రను, ఖగోళ, భూగోళ పరిశోధనలు, ఆవిష్కరణలు మొదలైన వాటితో విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనలు, దృక్పథాన్ని కల్పించడం చాలా గొప్ప విషయమన్నారు. ఈ సంస్థ అభివృద్ధికి సహకరిస్తున్న ఇస్రో, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, అటామిక్ ఎనర్జీ కమిషన్ ఆఫ్ ఇండియా, తదితర సంస్థల సరసన సింగరేణి కూడా చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

**డైనోసర్ పెవిలియన్ పక్కనే స్టెగోడాన్**

ప్రాచీన కాలంనాటి ఒక గొప్ప చారిత్రక ఆనవాలును సింగరేణి సంస్థ భద్రపరిచి, తమకు అందించడంపై బి.ఎం. బిర్లా ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ కె.మృత్యుంజయ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో గతంలో లభ్యమైన భారీ డైనోసర్ ఎముకలతో బిర్లా మ్యూజియంలో డైనోసార్ అస్థిపంజరాన్ని పున:ప్రతిష్టించామని, దాదాపు అదే కాలంలో సంచరించిన స్టెగోడాన్ ఏనుగు అవశేషాలు సింగరేణి ద్వారా లభించగా వీటిని డైనోసర్ పెవిలియన్ పక్కనే ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**నాటి ఏనుగు దంతాలు ఎలా దొరికాయంటే**

రామగుండం-1 ఏరియా పరిధిలో గోదావరి నదికి పక్కన నాలుగేళ్ల క్రితం మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని క్వారీ తవ్వుతున్న సందర్భంగా పొడుగాటి కొమ్ముల మాదిరిగా ఉన్న నాలుగు శిలాజాలను గుర్తించారు. ఇవి పాతకాలం నాటి జంతు అవశేషాలుగా భావించి ఉద్యోగులు యాజమాన్యానికి తెలిపారు. యాజమాన్యం వీటిని పరిశోధకులకు చూపించగా ఇవి సుమారు 110 లక్షల సంవత్సరాల క్రితం జీవించి 6 వేల సంవత్సరాల క్రితం భూమి నుంచి అంతరించిపోయిన స్టెగోడాన్ జాతి ఏనుగు దంతాలుగా గుర్తించారు. సాధారణంగా ఇప్పటి ఏనుగు దంతాలు రెండు లేదా మూడు అడుగుల పొడవు మాత్రమే ఉంటుండగా నాటి ఏనుగు దంతాలు సుమారు 12 అడుగుల పొడవు వరకు ఉండేవని, ఏనుగు 13 అడుగుల ఎత్తు, 12.5 టన్నుల బరువుతో ఉండేదని తెలిపారు. ఈ స్టెగోడాన్ జాతి ఏనుగుల అవశేషాలు గతంలో నర్మదా నది ప్రాంతంలోనూ, ప్రపంచంలో నాలుగైదు ప్రదేశాల్లో మాత్రమే లభించాయి. సింగరేణిలో లభ్యమైన స్టెగోడాన్ జాతి ఏనుగు దంతాలలో ఒక జత దంతాలను బిర్లా మ్యూజియం వారికి అందజేయగా మరొక జత దంతాలను నెహ్రూ జూలాజికల్ పార్క్‌కు గతంలోనే సింగరేణి అందజేసింది.

# ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని ప్రారంభించిన ప్రధాని

**తెలంగాణ నుండి ఎంపిక అయిన జిల్లాలో జనగామ ఒకటి**



జనగామ జిల్లా, అక్టోబర్ 11 (తీన్మార్ న్యూస్): వ్యవసాయ ఉత్పాదకత పెంపు, నీటిపారుదల సౌకర్యాల మెరుగుదల, రైతులకు సులభతర రుణాల కల్పన మొదలగు అంశాల తో రూపొందించిన...ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకానికి దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన 100 జిల్లాల్లో అమలు చేసేందుకు ఢిల్లీ నుండి వర్చువల్ గా దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ పథకాన్ని శనివారం ప్రారంభించారు. ఈ ప్రారంభ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని.. కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, జనగాం శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, వ్యవసాయ, అనుబంధ శాఖ అధికారులు, %రూాజూ% ఛైర్మన్, %జజూ%, సంఘ సభ్యులు, ఆయిల్ ఫెడ్ అధికారులు, ఐకేపీ మహిళలు, అన్ని మండలాల నుండి రైతులు వీక్షించారు

# పట్టణ కేంద్రంలో ఉచిత ఎముకల సాంద్రత పరీక్ష శిబిరం

**ప్రజలు అవకాశం సద్వినియోగం చేసుకోవాలి**

పరకాల, అక్టోబర్ 11 (తీన్మార్ న్యూస్): పరకాల పట్టణంలోని హుజురాబాద్ రోడ్ లో గల హిమ పాలి క్లినిక్ లో ఆదివారం రోజున ఎముకల సాంద్రత (బిఎండి) పరీక్ష, యూరిక్ ఆసిడ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు హిమ పాలి క్లినిక్ నిర్వాహకులు సూర విష్ణు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12.10.2025 ఆదివారం రోజున డాక్టర్ బంద నవీన్ కుమార్ ఆర్తో ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత ఓపీ మరియు 2500 రూపాయల విలువగల ఎముకల సాంద్రత (బిఎండి) మరియు యూరిక్ యాసిడ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 970 4053212 అనే నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

# మెగా టెక్స్ టైల్ పార్కులో ఉత్పత్తిపై కేటీఆర్ హర్షం

**మొదటి యూనిట్ ఉత్పత్తి ప్రారంభించడం సంతోషం**

**ఎక్స్ లో వేదికగా స్పందించిన కేటీఆర్**



హైదరాబాద్, అక్టోబర్ 11 (తీన్మార్ న్యూస్): వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కులో ఉత్పత్తిపై కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. మొదటి యూనిట్ ఉత్పత్తి ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. వరంగల్ సమీపంలోని కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ లో తమ తొలిదశ ఉత్పత్తిని తాజాగా ప్రారంభించింది. ఈ మేరకు శనివారం ఎక్స్ లో కేటీఆర్ స్పందించారు. ఈ మెగా టెక్స్ టైల్ తెలంగాణకు గర్వకారణం అని ఇక్కడి నుంచి ప్రపంచ మార్కెట్లకు టీషర్టులు ఎగుమతి చేయడం సంతోషంగా ఉందన్నారు. 2023లో కాకతీయ టెక్స్ టైల్ పార్కులో 11 యంగ్ వన్ కార్పొరేషన్ ఫ్యాక్టరీలకు శంకుస్థాపన చేశామన్నారు. అన్ని యూనిట్లు ప్రారంభమైతే వరంగల్ ప్రధాన వస్త్ర కేంద్రంగా మారబోతోందన్నారు. ఫార్మ్ టు ఫ్యాషన్ నినాదంతో టెక్స్ టైల్ పార్క్ స్థాపించామని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ టీఎస్ఐపాస్ సింగిల్ విండో క్లియరెన్స్ సిస్టమ్ విధానం వల్లే ఇదంతా సాధ్యమైందని అన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి బహిరంగ లేఖ

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 11 (తీన్మార్ న్యూస్): గోదావరి- బనకచర్ల ప్రాజెక్టు విషయమై చర్చించేందుకు సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ బహిరంగ లేఖ రాశారు. ఏపీ విభజన చట్టం 2014, గోదావరి ట్రైబ్యునల్ తదితర చట్టాలకు విరుద్ధంగా గోదావరి - బనకచర్ల ప్రాజెక్టును చేపడుతున్నారని సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ అభ్యంతరాలు తెలుపుతూ పలుమార్లు కేంద్రానికి లేఖలు రాయగా వాటిపై సీఆర్ పాటిల్ స్పందించారు. పోలవరం- బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై తెలంగాణ రాష్ట్రం లేవనెత్తిన అభ్యంతరాలు తమకు అందినట్లుగా సీఆర్ పాటిల్ లేఖలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుపై ఏపీ ప్రభుత్వం ఇచ్చిన ప్రీ- ఫీజిబిలిటీ నివేదికను కూడా పరిశీస్తున్నామని, ప్రాజెక్ట్ ప్రాథమిక సాధ్యాసాధ్యాలు పరిశీలనలో ఉన్నాయని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుపై తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. గోదావరి బేసిన్ లో ఉన్న అన్ని రాష్ట్రాల అభిప్రాయాల మేరకు సాంకేతిక అంశాలను నిబంధనల మేరకు పరిశీలిస్తామని లేఖలో పేర్కొన్నారు.

# రైతుల సవాళ్ల పరిష్కారంలో నూతన ఆవిష్కరణలు

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 11 (తీన్మార్ న్యూస్): రైతుల ముఖాల్లో ఆనందం చూడాలనేదే మా మొదటి ప్రాధాన్యత అని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. రైతులకు ఎదురవుతున్న సవాళ్ల పరిష్కారంలో నూతన ఆవిష్కరణలు వస్తున్నాయని రైతుల కోసం ఖర్చు చేయడంలో వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. శనివారం న్యూఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధనా సంస్థలో జరిగిన ప్రత్యేక కృషి కార్యక్రమంలో వ్యవసాయ ఉత్పాదకత పెంపు, నీటిపారుదల సౌకర్యాల మెరుగుదల, రైతులకు సులభతర రుణాల కల్పన కోసం ఎంపిక చేసిన 100 జిల్లాల్లో అమలు చేయనున్న ప్రధాన మంత్రి ధనధాన్య కృషి యోజన పథకం, పప్పు ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించేలా పప్పు ధాన్యాల స్వయం-సమృద్ధి మిషన్ అనే రెండు పథకాలను ప్రారంభించారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో మొత్తం రూ.42,000 కోట్లకుపైగా విలువైన రెండు పథకాలు, పలు ప్రాజెక్టులకు పీఎం శంకుస్థాపన చేశారు. ప్రధాన మంత్రి ధనధాన్య కృషి యోజన పథకానికి తెలంగాణ నుంచి నారాయణపేట, గద్వాల, జనగామ, నాగర్ కర్నూల్ జిల్లాలు, ఆంధ్రప్రదేశ్ నుంచి అల్లూరి సీతారామరాజు, అనంతపురం, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాలు ఎంపికయ్యాయి.



# చేపలను మింగుతున్న కాలుష్యం!

పరిశ్రమల కాలుష్యం నదులను, చెరువులను, చివరకు సముద్రాన్ని కూడా కలుషితం చేస్తోంది. మన జీవితాలు ఏమయితేనేమి అన్న ధోరణిలో పరిశ్రమల యజమానులు కాలుష్యాన్ని విచ్చలవిడిగా వెదజల్లుతున్నారు. ఒకప్పుడు పటాన్ చెరువు కాలుష్యంపై ఏళ్లుగా పోరాటాలు జరిగాయి. తరవాత ఎల్‌బినగర్ సిరిస్ కంపెనీ కాలుష్యంపైనా పోరాటాలు సాగాయి. హుస్సేన్ సాగర్ కాలుష్యం అలాగే ఉండిపోయింది. కొబ్బరినీళ్లలా హుస్సేన్ సాగర్ నీళ్లను చేస్తానన్న కెసిఆర్ కూడా పట్టించుకోలేదు. ఢిల్లీ కాలుష్యంపై సుప్రీంకోర్టు గట్టిగానే హెచ్చరించినా అడుగులు పడడం లేదు. ఇప్పుడు ఉప్పాడ కాలుష్యం పై మత్స్యకారులు పోరాటం చేస్తున్నారు. దీనిపై డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ గట్టిగానే స్పందించారు. అయితే ఆయన పట్టుదల ఎంతవరకు అన్నది తేలాల్సి ఉంది. పట్టుదలతో కాలుష్యాన్ని అరికట్టగలిగితే చిరస్థాయిగా నిలిచిపోతారు. సముద్రాన్ని కాపాడుకున్నవారం అవుతాం. అలాగే విశాఖలో సముద్రజలాల కాలుష్యం కూడా ఇంతకుమించి ఉంది. వీటిపై ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. కాకినాడ జిల్లాలో ఉన్న పారిశ్రామిక కాలుష్యం, మైనింగ్ మూలంగా తలెత్తుతున్న కాలుష్య ఇబ్బందులపై కాలుష్య నియతం÷-రణ అధికారులతో పవన్ కళ్యాణ్ చర్చించారు. కాకినాడలో చేపట్టిన మత్స్యకారులతో మాట..మంతిలో మత్స్యకారులు ప్రస్తావించిన అంశాలు, వారి సందేహాలపై పీసీబీ నుంచి వివరాలు తీసుకున్నారు. పొల్యూషన్ ఆడిట్‌కి అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించారు. కాకినాడ జిల్లాతోపాటు గోదావరి జిల్లాల్లో ఉన్న కాలుష్య పరిస్థితులు, పర్యావరణ పరిరక్షణపై వివరాలు అడిగి పవన్ కల్యాణ్ తెలుసు కున్నారు. దీనిపై ఎలాంటి అడుగులు వేస్తారన్నది ఇప్పుడు అందరి దృష్టి ఉంది. నిజానికి ఉప్పాడ తీరంలో ఉంటున్న వారంతా సముద్రాన్నే నమ్ముకుని చేపల వేట ద్వారా కుటుంబాలను పోషించుకుంటున్న మత్స్యకారులు. ఏళ్ల తరబడి వేటే ఆధారంగా జీవిస్తున్నారు. వీరి ఉపాధికి ఫార్మా కంపెనీలు గండి కొడుతున్నాయి. ఈ పరిశ్రమల వ్యర్థాలను సముద్రంలోకి విడిచిపెడుతుండడంతో చేపల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతోంది. కాకినాడ జిల్లా కెఎస్‌ఇజడ్ పరిధిలో లైఫిజ్, అరబిందో ఫార్మా కంపెనీల నుంచి వచ్చే వ్యర్థాలను సముద్రంలోకి విడిచిపెట్టేందుకు యు.కొత్తపల్లి మండలంలో కోనపాపపేట, తొండంగి మండలం పెరుమల్లపురం మధ్యలో మూడు కిలోమీటర్ల పొడవున భారీ పైపు లైన్‌ను రెండేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. దీనిద్వారా ఫార్మా వ్యర్థాలు, విషపూరిత జలాలను శుద్ధి చేయకుండా సముద్రంలోకి నేరుగా విడుదల చేస్తున్నారు. అరబిందో పరిశ్రమ నుంచి కూడా భారీ పైపులైను ద్వారా వ్యర్థాలను సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం చేపల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. నిర్వహణ ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఫార్మా కంపెనీలు, తీర ప్రాంతానికి ఆనుకుని ఉన్న హేచరీల ద్వారా రసాయనిక జలాలు, ఇతర వ్యర్థాలు సముద్రంలోకి వదిలేస్తున్నారు. దీనివల్ల చేపలు దూరంగా వెళ్లిపోయాయి. కొన్ని చేపలు చనిపోతున్నాయి. పరిశ్రమల కాలుష్యంపై వైసిపి హయాం నుంచీ పోరాటం చేస్తున్నారు.. ఎవరూ పట్టించుకోవట్లేదు. ప్రభుత్వం మారిన తర్వాతైనా న్యాయం జరుగుతుందని ఆశించారు. వ్యర్థాలను శుద్ధి చేసిన తర్వాతే వ్యర్థాలను సముద్రంలోకి వదలాలని కోరుతున్నారు. యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ నుంచి తొండంగి మండలం అద్దారిపేట వరకు సుమారు 32 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉంది. ఈ రెండు మండలాల్లో 18 గ్రామాలకు చెందిన దాదాపు 50 వేల మంది మత్స్యకారులు చేపల వేటే ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. ఫార్మా కంపెనీల వ్యర్థాల వల్ల చేపలు చనిపోతున్నాయని వారు ఆందోళన చెందుతున్నారు. మూడేళ్ల నుంచి చేపల ఉత్పత్తి తగ్గిపోయిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చిన్నబోటుపై వేటకు వెళ్తే రోజుకు రూ.5 వేల నుంచి రూ.8 వేల విలువైన మత్స్య సంపద దొరికేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని చెబుతున్నారు. ఒక్కసారి వేటకు వెళ్తే చిన్నబోటుకు రూ.2 వేలు, పెద్ద బోటుకు రూ.25 వేల నుంచి రూ.30వేల వరకూ ఆయిల్‌కు ఖర్చవుతుందని తెలిపారు. పెద్ద బోట్లలో 12 మంది వరకూ వేటకు వెళ్తారని, 15 రోజుల వరకూ సముద్రం లోనే ఉండాల్సి ఉంటుందన్నారు. ఆయిల్, ఐస్, ఇతర నిర్వహణకు మొత్తంగా రూ.1.50 లక్షల వరకూ ఖర్చు అవుతుందని తెలిపారు. ఖర్చులుపోనూ గతంలో రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ ఆదాయం సమకూరేదని, ప్రస్తుతం చేపలు దొరక్కపోవడంతో ఖర్చులు కూడా రావట్లేదని ఉప్పాడ మత్స్యకారులు తెలిపారు.గత జగన్ ప్రభుత్వ హయాం నుంచి ఈ సమస్యల పరిష్కారం కోసం మత్స్యకారులు ఆందోళనలు సాగిస్తున్నారు. మత్స్యకారులు గతేడాది ఏప్రిల్‌లో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. బీచ్ రోడ్డుని పూర్తిగా నిర్బంధించి పది రోజులపాటు నిరసన గళాన్ని వినిపించారు. ఎన్నికల కోడ్‌తో ఆందోళన విరమించారు. ఎన్నికల సమయంలో ఉప్పాడలో నిర్వహించిన బహిరంగ సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడారు. కాలుష్య పరిశ్రమలను నిలిపేస్తామని హామీ ఇచ్చారు. ఆయన డిప్యూటీ సిఎం అయినప్పటికీ హామీ అమలు కాలేదు. దీంతో, మత్స్యకారులు మళ్లీ ఆందోళనబాట పట్టారు. వేల సంఖ్యలో ఉప్పాడ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ స్పందించి ఇటీవలే వారితో చర్చించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారానికి వంద రోజుల సమయం కావాలని కోరారు. న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీ ఎంతవరకు అమలవుతుందో చూడాలి. అయితే వెంటనే అధికారులతో సమస్యపై చర్చించడంతో కొంత ఆశ చిగురిస్తోంది.

# నోబెల్ శాంతి బహుమతి ఇమ్మని అడగలేదు

- మచాడతో ఫోన్‌లో మాట్లాడనని ట్రంప్ వెల్లడి
- ఆమె పోరాటానికి తన మద్దతు ఉంటుందని ప్రకటన




**వాషింగ్టన్, అక్టోబర్ 11:** ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి బహుమతి దక్కకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా స్పందించారు. ఈ బహుమతి కోసం ట్రంప్ తహతహలాడిన విషయం తెలిసిందే. అయితే, ట్రంప్ 'శాంతి' ఆశలపై నీళ్లు చల్లుతూ 2025 నోబెల్ శాంతి బహుమతి వెనెజువెలా ప్రధాన ప్రతిపక్ష నాయకురాలు, ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న మరియా కొరీనా మచాడోకు నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో శాంతి బహుమతి దక్కకపోవడంపై ట్రంప్ తాజాగా స్పందించారు. ఈ మేరకు మరియా కొరీనా మచాడోతో ఫోన్‌లో సంభాషించినట్లు తెలిపారు. 'కొరీనా మచాడోతో ఫోన్‌లో మాట్లాడాను. నా గౌరవార్థం దాన్ని స్వీకరించినట్లు ఆమె నాతో చెప్పారు. అలా అని ఆ బహుమతి నాకు ఇచ్చేయమని నేను అడగలేదు. విపత్తు సమయంలో వెనెజువెలాలోని ప్రజలకు ఆమె చాలా సాయం చేశారు. నేను ఆమెకు తోడున్నా. ఇకముందు కూడా ఉంటా' అని వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి మరియా కొరీనా మచాడోను వరించిన విషయం తెలిసిందే. ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం విశేషంగా కృషి చేసిన మచాడో వెనెజువెలా ఉక్కు మహిళగా కూడా పేరుపొందారు. టైమ్ మ్యాగజైన్ ప్రచురించిన ప్రపంచంలోని అత్యంత పలుకుబడిగల 100 మంది ప్రముఖుల జాబితాలో కూడా ఆమె చోటు దక్కించుకున్నారు. గత ఏడాది జరిగిన వెనెజువెలా పార్లమెంట్ ఎన్నికలలో భారీ స్థాయిలో రిగ్గింగ్ జరిగి ప్రస్తుత అధ్యక్షుడు నికొలస్ మదురో గెలుపొందిన తర్వాత 58 ఏళ్ల మచాడో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ శాంతి బహుమతి దక్కడంపై మరియా కొరీనా స్పందిస్తూ.. 'స్వేచ్ఛ కోసం, ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న వెనెజువెలా ప్రజలందరికీ ఈ గుర్తింపు గొప్ప ప్రేరణ ఇస్తుంది. లక్ష్యసాధనలో విజయానికి చేరువలో ఉన్నాం. ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలు మాకు మిత్రులు. ఈ పురస్కారాన్ని కష్టాల్లో ఉన్న వెనెజువెలా ప్రజలతోపాటు మా పోరాటానికి నిర్మాణాత్మక మద్దతు ఇస్తున్న ట్రంప్‌నకు అంకితం ఇస్తున్నా' అని అన్నారు.

# వికసిత్ భారత్‌లో రైతులది ముఖ్య భూమిక

- ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను పండించాలి
- ఇతర దేశాలపై ఆధారపడకుండా స్వయంసమృద్ధి సాధించాలి
- జీఎస్‌టీ సంస్కరణతో రైతులు, గ్రామీణ రంగానికి ప్రయోజనం
- సాగు వ్యవయం తగ్గించేందుకు ఐదేళ్లలో రూ.13లక్షల కోట్ల సబ్సిడీ
- ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని ప్రారంభించిన మోడీ





**న్యూఢిల్లీ, అక్టోబరు 11:** దేశం వికసిత్ భారత్ వైపు అడుగులు వేయడంలో రైతులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. భారత్ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే.. కేవలం వరి, గోధుమ పంటల పైనే కాకుండా ప్రొటీన్ అధికంగా లభించే పప్పులకు సంబంధించిన సాగును మరింత పెంచాలని రైతులకు సూచించారు. ప్రపంచ మార్కెట్‌లకు ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను పండించాలన్నారు. దేశంలో పంటల ఉత్పత్తికి అయ్యే ఖర్చులు తగ్గించి.. రైతుల ఆదాయం పెంచే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో పదేళ్లలో వ్యవసాయ రంగంలో కేవలం రూ.5 లక్షల కోట్ల సబ్సిడీలు ఇస్తే.. తమ ప్రభుత్వం పదేళ్లలో రైతులకు రూ.13 లక్షల కోట్లకు పైగా సబ్సిడీలు ఇచ్చిందని పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో శనివారం జరిగిన ప్రత్యేక కృషి ప్రోగ్రాంలో ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా గత నెలలో అమల్లోకి వచ్చిన జీఎస్‌టీ సంస్కరణతో రైతులు, దేశంలోని గ్రామీణ రంగానికి మరింత ప్రయోజనం చేకూరిందని మోదీ చెప్పారు. గత ప్రభుత్వాలకు వ్యవసాయం పై ఎలాంటి విజన్ లేదని విమర్శించారు. రైతుల ఆదాయం పెంచేందుకు, పంటల సాగు వ్యయం తగ్గించేందుకు గత పదేళ్లుగా ఎన్డీయే ప్రభుత్వం ఎరువులపై రూ.13లక్షల కోట్ల సబ్సిడీ ఇచ్చిందని ప్రధాని మోదీ అన్నారు. యూపీఏ పదేళ్లలో రూ.5 లక్షల కోట్లు మాత్రమే సబ్సిడీగా ఇచ్చిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు వ్యవసాయరంగానికి ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని వివరించారు. రైతులకు కేంద్రంలోని గత కాంగ్రెస్ ప్రభుత్వం చేసేందేమీ లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 2004 నుంచి 2014 వరకూ యూపీఏ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అయితే బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 11 ఏళ్లుగా రైతుల అభివృద్ధి, స్వయం సమృద్ధికి ఎన్నో చర్యలు తీసుకుందని వివరించారు. వ్యవసాయరంగానికి సంబంధించిన వివిధ శాఖలు ఇష్టారీతిలో వ్యవహరించడం వల్ల దేశంలోని వ్యవస్థాయ వ్యవస్థ బలహీనమవుతూ వచ్చిందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిలో మార్పులు చేస్తూ విత్తనాల దగ్గర నుంచి మార్కెట్ వరకూ రైతులకు ప్రయోజనాలు చేకూరే లెక్క లేనని సంస్కరణలు తెచ్చామని చెప్పారు. దేశ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు దాదాపు రెట్టింపయ్యాయని, ఆహారధాన్యాలు, పళ్లు, కాయగూరల ఉత్పత్తి సుమారు 90 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెరిగిందని, గతంలో ఇది 64 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉండేదని చెప్పారు. 2014 నుంచి తేనె ఉత్పత్తి రెట్టింపు అయిందని అన్నారు. అభివృద్ధి భారతాన్ని కోరుకుంటే ప్రతి రంగంలోనూ ఇండియా బలపడాల్సి ఉంటుందన్నారు. ఏవో కొన్ని సాధించినంత మాత్రాన తృప్తి పడిపోరాదని సూచించారు. వెనుకబడిన ప్రాంతాలపై దృష్టి పెట్టినప్పుడే గణనీయమైన ఫలితాలు ఉంటాయన్నారు. ఇవాళ యాస్పిరేషనల్ జిల్లాల్లో ప్రసూతి మరణాలు తగ్గాయని, చైల్డ్ హెల్త్ మెరుగైందని, విద్యాప్రమాణాలు పెరిగాయని చెప్పారు. ఈ జిల్లాలు ఇతర జిల్లాల కంటే మెరుగైన రీతిలో దూసుకెళ్తున్నాయని, ఈ మోడల్ ఆధారంగా వ్యవసాయంలో వెనుకబడిన 100 జిల్లాలను అభివృద్ధి చేసేందుకు దృష్టి సారించామని, ఇందువల్ల అవి మరింత మెరుగైన జిల్లాలుగా మారనున్నాయని చెప్పారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే అన్ని రంగాల్లో నిరంతరం కొత్త మార్పులు చోటుచేసుకోవాలని ప్రధాని పేర్కొన్నారు. ఈ ఆలోచనలో భాగంగానే ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు దేశంలోని 100కు పైగా జిల్లాలను వెనకబడిన జిల్లాలుగా ప్రకటించి.. ఆపై వాటిని పూర్తిగా మరిచిపోయాయని ప్రధాని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ వెనకబడిన జిల్లాలపై ప్రత్యేక దృష్టిసారించి, వాటిని ఆశావహ జిల్లాలుగా ప్రకటించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాజెక్టులను అమలుచేస్తోందన్నారు. వీటన్నింటినీ ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన కిందకు తీసుకువస్తున్నట్లు తెలిపారు. వెనకబడిన జిల్లాలలోని అనేక ప్రాంతాల్లో గత పాలకులు రోడ్లు కూడా వేయించలేదని.. అటువంటి వాటిని తమ ప్రభుత్వం డిజిటల్ ఇండియా దిశగా నడిపిస్తోం దన్నారు. గ్రామీణప్రాంత ప్రజలకు విద్య, వైద్యం, నివాసం, విద్యుత్, రోడ్డు వంటి అన్నిరకాల సదుపాయాలు కల్పించడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత పదకొండేళ్లలో రైతులు పలు విజయాలు సాధించారని.. పదివేలకు పైగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పడ్డాయన్నారు.

# వాట్సాప్ లేకుంటే ఏమి?

## అరట్టై ఉపయోగించండి • పిటిషనర్‌కు సుప్రీం సలహా

**న్యూఢిల్లీ, అక్టోబరు 11:** వాట్సప్‌కు పోటీగా తీసుకొచ్చిన స్వదేశీ మెసేజింగ్ యాప్ 'అరట్టై' పేరు ఇటీవల నెట్టింట మార్మోగుతోంది. తాజాగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టులోనూ దీని ప్రస్తావన వచ్చింది. వాట్సప్ ఖాతా పునరుద్ధరణకు సంబంధించి దాఖలైన ఓ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. వాట్సప్ లేకపోతే ఏం.. అర్టటై వాడొచ్చు కదా అని సూచించింది. తన ఖాతాను వాట్సప్ బ్లాక్ చేసిందని, దాన్ని పునరుద్ధరించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. సామాజిక మాధ్యమాలు ఇలా ఖాతాలను ఉన్నట్టుండి నిషేధించకుండా ఉండేలా మార్గదర్శకాలు జారీ చేయాలని పిటిషనర్ న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై సుప్రీం ధర్మాసనం ఒకింత అసహనం వ్యక్తంచేసింది. ఆర్టికల్ 32 కింద ఈ పిటిషన్ ఎందుకు వేశారని అడిగింది. వాట్సప్ యాక్సెస్ ఉండటం ప్రాథమిక హక్కు ఎలా అవుతుందని ప్రశ్నించింది. దీనికి పిటిషనర్ తరఫు న్యాయవాది బదులిస్తూ.. పిటిషనర్ ఓ పాలీ డయాగ్నిక్ సెంటర్‌లో పనిచేస్తున్నారు. గత 10-12 ఏళ్లుగా వాట్సప్‌లోనే తన క్లయింట్‌లతో టచ్‌లో ఉన్నారు. ఉన్నట్టుండి ఆ ఖాతాను బ్లాక్ చేశారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. అయితే ఏంటీ? కమ్యూనికేషన్ కోసం ఇతర యాప్‌లు కూడా ఉన్నాయి. వాటిని ఉపయోగించొచ్చు కదా..! ఈ మధ్యే స్వదేశీ యాప్ 'అర్టటై' కూడా వచ్చింది. దాన్ని వాడుకోండి. మేక్ ఇన్ ఇండియా! అని సూచించింది. ఈ పిటిషన్ హైకోర్టులో కూడా విచారణకు అర్హమైంది కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీనిపై ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరిస్తూ పిటిషన్‌ను తిరస్కరించింది. కోర్టు అనుమతితో పిటిషనర్ తన వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్నారు.దేశీయ సంస్థ జోహో అభివృద్ధి చేసిన అర్టటైకి విపరీతమైన ప్రజాదరణ లభిస్తోంది. ఇప్పటికే కోటి మందికి పైగా దీన్ని డౌన్‌లోడ్ చేసుకున్నారు. అర్టటై అంటే తమిళంలో పిచ్చాపాటీ సంభాషణ అని అర్థం. ఈ యాప్ ద్వారా మెసేజ్‌లు, వాయిస్, వీడియో కాల్స్ చేసుకోవటానికి, మీటింగుల్లో పాల్గొనటానికి, స్టోరీలు, ఫొటోలు, డాక్యుమెంట్స్ షేర్ చేసుకోవచ్చు.

# అఫ్ఘాన్ మంత్రి మీడియా సమావేశం

## మహిళా జర్నలిస్టులకు అందని ఆహ్వానం

## తమకు సంబంధం లేదని వెల్లడించిన కేంద్రం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 11:** అఫ్ఘానిస్థాన్ విదేశాంగ శాఖ మంత్రి ముత్తకీ పాల్గొన్న ప్రెస్‌మీట్‌కు మహిళా జర్నలిస్టులను అనుమతించకపోవడంపై వివాదం రేగుతోంది. ఈ వివాదంపై తాజాగా కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఈ పత్రికాసమావేశం నిర్వహణలో తమ పాత్ర ఏమీ లేదని స్పష్టం చేసింది. పత్రికా సమావేశానికి సంబంధించి అహ్వానాలు ముంబైలోని అఫ్ఘాన్ కాన్సుల్ జనరల్‌లో గల కొందరు ఎంపిక చేసిన జర్నలిస్టులకు అందాయని విదేశాంగ శాఖ తెలిపింది. ఎంబసీ పరిసరాలు భారత ప్రభుత్వ పరిధిలోకి రావని కూడా స్పష్టం చేసింది. అఫ్ఘాన్ మంత్రి ప్రెస్ మీట్‌లో మహిళా జర్నలిస్టులు ఎవరూ కానరాలేదు. పత్రికా సమావేశానికి వెళ్లేందుకు ప్రయత్నించిన కొందరు మహిళలను కూడా అడ్డుకున్నట్టు వార్తలు వచ్చాయి. దీంతో సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. మహిళా జర్నలిస్టులందరూ గౌరవప్రదమైన డ్రెస్ కోడ్‌నే అనుసరించినా వివక్ష ఎందుకని కొందరు నెట్టింట ప్రశ్నించారు. తాలిబాన్‌ల పాలనలో అఫ్ఘాన్ మహిళలు తీవ్ర అణచివేత ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. విద్య, ఉద్యోగం, రాజకీయ రంగంలో మహిళలపై అక్కడ తీవ్ర ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితిపై ఐక్యరాజ్య సమితి కూడా ఆందోళన వ్యక్తం చేసింది. మానవ హక్కుల ఉల్లంఘనలు సంక్షోభస్థాయికి చేరుకున్నాయని పేర్కొంది.

# మీ చర్మం ఆరోగ్యంగా ఉండడంతోపాటు ముఖ సౌందర్యం పెరగాలంటే..

## రోజూ ఈ పండ్లను తినాలి..!



చర్మం మృదువుగా, తేమగా ఉండడంతోపాటు సురక్షితంగా ఉండాలని, కాంతివంతంగా మారి మెరవాలని చాలా మంది కోరుకుంటుంటారు. అందులో భాగంగానే చర్మ సంరక్షణకు అనేక మార్గాలను అనుసరిస్తుంటారు. కొందరు బ్యూటీ పార్లర్ చికిత్సలను తీసుకుంటారు. ఇంకా కొందరు ఇంట్లోనే పలు చిట్కాలను పాటిస్తుంటారు. అయితే చర్మ సౌందర్యం, సంరక్షణ కోసం ఆయా చికిత్సలను, చిట్కాలను పాటించడం సరైందే అయినప్పటికీ ఆహారం విషయంలోనూ మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. మనం తినే ఆహారం సరిగ్గా ఉంటేనే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. చర్మ సంరక్షణకు ఆహారం కూడా చాలా ముఖ్యమైందే అన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి. ఈ క్రమంలోనే పలు రకాల పండ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే దాంతో చర్మాన్ని సురక్షితంగా ఉంచుకోవచ్చు. ఇక ఆ పండ్లు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

**బెర్రీలు, సిట్రస్ ఫలాలు..**

స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్ బెర్రీల వంటి బెర్రీ పండ్లను రోజూ తింటుంటే చర్మాన్ని సురక్షితంగా ఉంచుకోవచ్చు. ఈ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లతోపాటు విటమిన్ సి అధిక మె-ంత్తంలో ఉంటుంది. ఇవి చర్మాన్ని దృఢంగా మార్చి యవ్వనంగా ఉండేలా చేస్తాయి. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల వల్ల ఫ్రీ ర్యాడికల్స్ తొలగిపోతాయి. దీని వల్ల కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీంతో వృద్ధాప్య ఛాయలు రాకుండా అడ్డుకోవచ్చు. చర్మం మృదువుగా మారి కాంతివంతంగా ఉంటుంది. యవ్వనంగా కనిపిస్తారు. అలాగే సిట్రస్ జాతికి చెందిన నిమ్మ, నారింజ వంటి పండ్లను కూడా తింటుండాలి. ఈ పండ్లలోనూ విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తికి సహాయం చేస్తుంది. దీని వల్ల చర్మం సాగే గుణాన్ని పొందుతుంది. ముఖంపై ఉండే ముడతలు తగ్గిపోతాయి. ఈ పండ్లను తింటుంటే చర్మం కాంతివంతంగా మారుతుంది. ముఖంపై ఉండే నల్లని మచ్చలు, మొటిమలు తొలగిపోతాయి. చర్మం సురక్షితంగా ఉంటుంది.

**బొప్పాయి పండ్లు..**

బొప్పాయి పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. ఈ పండ్లు మన చర్మానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ పండ్లలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది ఎక్స్‌ఫోలియేటింగ్ గుణాలను కలిగి ఉంటుంది. కనుక చర్మంపై ఉండే మృతకణాలు తొలగిపోతాయి. బొప్పాయి పండ్లలో ఉండే వటమిన్లు ఎ, సి, ఇ వల్ల మొటిమలు తగ్గి చర్మం కాంతివంతంగా మారుతుంది. నల్లని మచ్చలు తొలగిపోతాయి. బొప్పాయిలో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాల వల్ల చర్మ వాపులు తగ్గిపోతాయి. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. దానిమ్మ పండ్లను తింటున్నా కూడా చర్మానికి మేలు జరుగుతుంది. ఈ పండ్లలో పాలిఫినాల్స్‌తోపాటు యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి సూర్యుని నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల బారి నుంచి చర్మాన్ని రక్షిస్తాయి. ఈ పండ్లలో యాంటీ ఏజింగ్ గుణాలు ఉంటాయి. కనుక వీటిని తింటే వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. ముఖ సౌందర్యం పెరుగుతుంది.

**అరటి పండ్లు..**

అరటి పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది చర్మానికి కావల్సిన తేమను అందిస్తుంది. ఈ పండ్లలో విటమిన్లు ఎ, బి, ఇ అధికంగా ఉంటాయి. కనుక అరటి పండ్లను తింటే పొడి చర్మం ఉన్నవారికి మేలు జరుగుతుంది. అరటి పండ్లను ఫేస్ ప్యాక్‌గా కూడా ఉపయోగించవచ్చు. దీంతో ముఖానికి కావల్సిన తేమ, మృదుత్వం లభిస్తాయి. ముఖం కాంతివంతంగా మారి మెరుస్తుంది. పుచ్చకాయలు, కీరదోసలను కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. వీటిల్లో నీరు అధిక మొత్తంలో ఉంటుంది. ఇది చర్మానికి కావల్సిన తేమను అందించి చర్మం సురక్షితంగా, ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. వీటిల్లో విటమిన్లు ఎ, సి సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపించాలంటే వీటిని తరచూ తింటుండాలి. అదేవిధంగా ద్రాక్ష పండ్లను తింటున్నా కూడా చర్మానికి మేలు జరుగుతుంది. ఈ పండ్లలో రెస్వెరెట్రాల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. చర్మాన్ని సూర్య కిరణాల బారి నుంచి రక్షిస్తుంది. చర్మం ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. ఇలా ఆయా పండ్లను రోజూ తింటుంటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. కాంతివంతంగా మారి మెరుస్తుంది. వృద్ధాప్య ఛాయలు రాకుండా యవ్వనంగా ఉంటారు.

# భ్రమలు వీడండి..



బరువు తగ్గండి నేటితరాన్ని 'ఊబకాయం' పట్టిపీడిస్తున్నది. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లతో.. 'బరువు' చేయిదాటి పోతున్నది. ఫలితంగా, అనేక రోగాలు చుట్టుముట్టే ప్రమాదం ఉన్నది. ఈ క్రమంలో బరువును అదుపులో పెట్టుకోవడానికి చాలామంది ప్రయత్నిస్తుంటారు. అందుకోసం నానా తిప్పలు పడుతుంటారు. అదే సమయంలో లేనిపోని అపోహలకు చాలామంది గురవుతున్నారు. వాటిని పక్కన పెడితేనే.. బరువు తగ్గొచ్చని నిపుణులు అంటున్నారు.

**భోజనం మానేయాల్సిందేనా?**

ఇది అచ్చంగా అపోహే! భోజనం మానేయడం వల్ల బరువు తగ్గడం అటుంచి.. కొన్ని సందర్భాల్లో బరువు పెరిగే అవకాశం కూడా ఉంటుంది. భోజనం మానేస్తే జీవక్రియ మందగిస్తుంది. కొన్నాళ్లకు ఇది అతిగా తినడానికి దారితీస్తుంది. అదే స్థిరమైన భోజన అలవాటు.. శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తుంది. బరువు తగ్గడానికి సాయపడుతుంది.

**కొవ్వు మంచిది కాదు..**

కేవలం బ్యాడ్ కొలెస్ట్రాల్ మాత్రమే బరువు పెంచుతుంది. అవకాడో, గింజలు, ఆలివ్ నూనెలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు.. నిజానికి బరువు తగ్గడానికి దోహదం చేస్తాయి.

**కార్బోహైడ్రేట్లు బరువు పెంచుతాయి..**

ఈ అపోహ చాలామందిలో ఉంటుంది. అయితే, ప్రతి కార్బోహైడ్రేట్.. ఆరోగ్యానికి హానికరం కాదు. బియ్యం, మైదా, చక్కెర లాంటి శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు తింటే.. బరువు పెరిగే అవకాశం ఉంటుంది. అదే పండ్లు, కూరగాయలు, ఇతర తృణధాన్యాల నుంచి వచ్చే కార్బోహైడ్రేట్లు.. ఫైబర్, పోషకాలతో నిండి ఉంటాయి. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి.

**వ్యాయామం ఒక్కటే చాలదు**

బరువు తగ్గడంలో వ్యాయామం కీలక పాత్ర పోషిస్తుంది. అయితే.. అదొక్కటే సరిపోదు. చాలామంది భోజనం తక్కువ తీసుకుంటూ.. ఎక్కువ వ్యాయామాలు చేస్తుంటారు. దీనివల్ల ఆరోగ్యం దెబ్బతింటుంది. దీర్ఘకాలంలో ఇది బరువును పెంచేస్తుంది. అందుకు బదులుగా, వ్యాయామానికి తగ్గట్టుగా పోషకాహారం తీసుకోవాలి. సరైన ఆహారం తీసుకోకుంటే.. మీరు ఎన్ని వ్యాయామాలు చేసినా ఫలితం ఉండదు.



# రాత్రి పూట మీరు తినే ఆహారంలో వీటిని చేర్చుకోండి..

## అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు..

అధికంగా బరువు ఉన్నవారు రాత్రి పూట భోజనాన్ని త్వరగా ముగిస్తుంటారు. రాత్రి పూట తినే ఆహారంలో చపాతీలను చేర్చుకుంటారు. అంతే కాదు రాత్రి పూట ఆహారాన్ని తక్కువగా తింటారు. ఇలా బరువు తగ్గాలనుకునే వారు రాత్రి భోజనం పట్ల అనేక జాగ్రత్తలను పాటిస్తుంటారు. అయితే బరువు తగ్గాలంటే పలు ఆహారాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. సరైన పోషకాలు ఉండే ఆహారాలను తింటే బరువు తగ్గడం తేలికవుతుంది. ఈ క్రమంలోనే రాత్రి పూట కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల సులభంగా బరువు తగ్గుతారు. వీటిల్లో అనేక పోషకాలు ఉంటాయి కనుక ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి. అధిక బరువు తగ్గాలనుకునే ప్రణాళికలో ఉన్న వారు రాత్రి పూట ఈ ఆహారాలను తీసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది.

**స్కిన్‌లెస్ చికెన్, చేపలు, కూరగాయలు..**

రాత్రి పూట ఆహారంలో స్కిన్ లెస్ చికెన్ తినవచ్చు. ఇది అద్భుతమైన ప్రోటీన్లను అందిస్తుంది. అలాగే రాత్రి పూట ఆహారంలో చేపలను తింటున్నా మేలు జరుగుతుంది. చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి బరువు తగ్గేందుకు సహాయం చేస్తాయి. సోయా టోఫులో వృక్ష సంబంధ ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని అందించడంతోపాటు బరువు తగ్గేందుకు దోహదం చేస్తాయి. పప్పు దినుసులు, శనగలను తింటున్నా కూడా ఫలితం ఉంటుంది. వీటిల్లో ఫైబర్, ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి బరువు తగ్గేలా చేస్తాయి. పిండి పదార్థాలు చాలా తక్కువగా ఉండే కూరగాయలను రాత్రి పూట తినాల్సి ఉంటుంది. పాలకూర, బ్రోకలీ, కాలిఫ్లవర్, మొలకలు, క్యాప్సికం, పుట్ట గొడుగులు, గ్రీన్ బీన్స్ వంటి ఆహారాలను రాత్రి పూట తింటుంటే మేలు జరుగుతుంది.

**కినోవా, బ్రౌన్ రైస్..**

సంక్లిష్టమైన పిండి పదార్థాలు ఉండే ఆహారాలను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. కినోవా, బ్రౌన్ రైస్, చిలగడదుంపలు వంటి వాటిల్లో సంక్లిమైన పిండి పదార్థాలు ఉంటాయి. ఇవి రక్తంలో గ్లూకోజ్‌గా మారేందుకు సమయం పడుతుంది. పైగా వీటిని కాస్త తిన్నా చాలు, వీటిల్లో ఉండే ఫైబర్ కారణంగా కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇలా ఇవి బరువు తగ్గేందుకు సహాయం చేస్తాయి. ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను కూడా రాత్రి పూట తినవచ్చు. అవకాడో, బాదంపప్పు, వాల్ నట్స్, చియా సీడ్స్‌ను రాత్రి పూట తినవచ్చు. అలాగే ఆలివ్ ఆయిల్‌ను కూడా తీసుకోవచ్చు. ఇవన్నీ రాత్రి పూట తీసుకోదగిన ఆహారాలు. అలాగే బరువు తగ్గేందుకు కూడా ఇవి ఎంతగానో దోహదం చేస్తాయి.

**ఈ కాంబినేషన్ ట్రై చేయండి..**

రాత్రిపూట ఆహారంలో చేపలను, కూరగాయలను కలిపి కాంబినేషన్‌లో తినవచ్చు. లేదా చికెన్, వెజిటబుల్ సలాడ్, ఫ్రూట్ సలాడ్ వంటి వాటిని కలిపి తీసుకోవచ్చు. బ్రౌన్ రైస్, వెజిటబుల్ సూప్‌ను కలిపి తీసుకోవచ్చు. సోయా టోఫు, కూరగాయలను కలిపి కూడా తినవచ్చు. ఇలా రాత్రి పూట భోజనాన్ని ప్లాన్ చేసుకోవచ్చు. అయితే ఆరోగ్యకరమైన ఆహారాలను తిన్నప్పటికీ వీటిని రాత్రి పూట తక్కువ మోతాదులోనే తినాలి. ఇతర ఆహారాలతో పోలిస్తే ఇవి బరువు తగ్గేందుకు మనకు ఎంతో ఉపయోగపడతాయి. కానీ ఎక్కువ మోతాదులో మాత్రం తినకూడదు. ఇక రాత్రి పూట భోజనాన్ని వీలైనంత త్వరగా తినేయాల్సి ఉంటుంది. భోజనానికి, నిద్రకు మధ్య కనీసం 2 నుంచి 3 గంటల వ్యవధి ఉండేలా చూసుకోవాలి. చక్కెర ఉండే ఆహారాలు, ప్రాసెస్ ఫుడ్స్, శీతల పానీయాలను తాగకూడదు. ఇలా ఆహారపు అలవాట్లను పాటిస్తుంటే అధిక బరువును చాలా తేలిగ్గా తగ్గించుకోవచ్చు.

# అల్లాన్ని నేరుగా తినలేరా..?

## అయితే అల్లం పాలను తయారు చేసి తాగండి.. ఎన్నో లాభాలను పొందవచ్చు..!



అల్లంను మనం నిత్యం అనేక రకాల వంటల్లో వేస్తూనే ఉంటాం. ముఖ్యంగా మసాల వంటకాల్లో అల్లాన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. అల్లంను వేయడం వల్ల వంటలకు చక్కని రుచి, వాసన వస్తాయి. ఆయుర్వేద ప్రకారం అల్లంలో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. కనుక అల్లాన్ని నేరుగా తినమని లేదా అల్లం రసం సేవించాలని వైద్యులు సూచిస్తుంటారు. అయితే అల్లం ఘాటుగా ఉంటుంది కనుక దీన్ని కొందరు నేరుగా తినలేరు. కానీ అల్లాన్ని పాలలో వేసి మరిగించి కూడా తీసుకోవచ్చు. ఇలా తీసుకున్నా కూడా ఆరోగ్యకర ప్రయోజనాలు కలుగుతాయి. అల్లం, పాలు కాంబినేషన్ చాలా శక్తివంతంగా పనిచేస్తుంది. ఈ మిశ్రమం అనేక లాభాలను అందిస్తుంది. అల్లం పాలను రోజూ తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. పలు వ్యాధులు సైతం అవుతాయి.

**సీజనల్ వ్యాధులకు..**

అల్లంలో శక్తివంతమైన కార్మినేటివ్ గుణాలు ఉంటాయి. అందువల్ల అల్లం పాలను సేవిస్తుంటే జీర్ణాశయ ఎంజైమ్‌లు, జీర్ణ రసాలు ఉత్పత్తి అవుతాయి. దీని వల్ల మనం తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి తగ్గుతుంది. గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి జీర్ణ సమస్యల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. పొట్టలో ఉండే అసౌకర్యం తొలగిపోతుంది. అల్లంలో జింజరాల్ అనే శక్తివంతమైన బయో యాక్టివ్ సమ్మేళనం ఉంటుంది. ఇది యాంటీ ఇన్ ఫ్లామేటరీ కారకంగా పనిచేస్తుంది. దీని వల్ల శరీరంలోని వాపులను తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా కీళ్ల నొప్పులు తగ్గుతాయి. ఒళ్లు నొప్పుల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. ఈ సీజన్‌లో చాలా మందికి దగ్గు, జలుబు, ఫ్లూ వంటి సమస్యలు వస్తుంటాయి. వాతావరణం చల్లగా ఉండడం వల్ల ఈ సమస్యలు వస్తాయి. కానీ అల్లం వల్ల ఈ సమస్యలకు చెక్ పెట్టవచ్చు. అల్లం పాలను తాగుతుంటే గొంతులో గరగర, గొంతు సమస్యలు, గొంతు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. ముక్కు దిబ్బడ తొలగిపోతుంది. శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులు, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది.

**గుండె ఆరోగ్యానికి..**

అల్లంలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్న కారణంగా అల్లం పాలను సేవిస్తుంటే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారి రోగాలు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. వికారంగా ఉండడం, వాంతికి వచ్చినట్లు అనిపించడం, ప్రయాణాల్లో వాంతులు అవడం వంటి సమస్యలు ఉన్నవారు అల్లం పాలను తాగుతుంటే వెంటనే ఉపశమనం లభిస్తుంది. ఈ పాలను తాగడం వల్ల నిద్రలేమి సైతం తగ్గిపోతుంది. పాలలో ఉండే ట్రిప్టోఫాన్ అనే అమైనో యాసిడ్ నిద్రను ప్రేరేపిస్తుంది. కనుక రాత్రి పూట ఈ పాలను తాగితే ఎంతో మేలు జరుగుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. అల్లం పాలను రోజూ సేవిస్తుంటే కొలెస్ట్రాల్ లెవల్స్, బీపీ తగ్గుతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఈ మిశ్రమంలో ఉండే పొటాషియం బీపీని తగ్గించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

**ఇలా తయారు చేయండి..**

ఇక అల్లం పాలను చాలా సులభంగా తయారు చేయవచ్చు. అందుకు గాను ఒక పాత్రలో పాలను తీసుకుని అందులో తురిమిన అల్లం వేసి 4 నుంచి 5 నిమిషాల పాటు బాగా మరిగించాలి. అనంతరం అందులో నల్ల మిరియాల పొడి, దాల్చిన చెక్క పొడి వేయాలి. తరువాత స్టవ్ ఆర్పి పాత్రను దించుకోవాలి. అనంతరం అందులో బెల్లం పొడి వేసి బాగా కలపాలి. అవసరం అనుకుంటే అందులో డ్రై ఫ్రూట్స్ లేదా కుంకుమ పువ్వును కలుపుకోవచ్చు. దీంతో పాలు రుచిగా ఉంటాయి. ఇక అలా తయారైన అల్లం పాలను గోరు వెచ్చగా ఉండగానే తాగేయాలి. దీంతో అనేక లాభాలు కలుగుతాయి.

అయితే అల్లంను తాజాగా ఉండేలా చూసుకోవాలి. ఈ మిశ్రమాన్ని మరీ అతిగా మరిగించకూడదు. అవసరం అనుకుంటే యాలకుల పొడి కూడా కలుపుకోవచ్చు. ఇక పొట్టలో ఎల్లప్పుడూ అసౌకర్యంగా ఉండేవారు, విరేచనాలు అవుతున్నవారు, రక్తాన్ని పలుచగా చేసే మందులను వాడుతున్న వారు, అలర్జీలు ఉన్నవారు, గర్భిణీలు, మొటిమలు, ఇతర చర్మ సమస్యలు ఉన్నవారు ఈ పాలను తాగకూడదు.

# టీమిండియా భారీ స్కోరు

## 578-5 వద్ద తొలి ఇన్నింగ్ డిక్లేర్

### సెంచరీలతో అదరగొట్టిన జైస్వాల్, గిల్!

### వెస్టిండీస్ నాలుగు వికెట్లకు 140 పరుగులు

### ఇంకా 378 పరుగుల వెనుకంజలో విండీస్




తొలి టెస్టును ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో కైవసం చేసుకున్న టీమిండియా రెండో టెస్టులోనూ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. శనివారం రెండో రోజు ఆటముగిసే సరికి వెస్టిండీస్ 43 ఓవర్లలో నాలుగు వికెట్లకు 140 పరుగులు చేసింది. వన్ డౌన్ బ్యాటర్ ఆలిక్ అతనాజ్ (41) టాప్ స్కోరర్ గా నిలిచాడు. క్రీజులో షాయ్ హోప్ (31 బ్యాటింగ్), వికెట్ కీపర్ బ్యాటర్ టెవిన్ ఇమ్లాచ్ (14 బ్యాటింగ్) ఉన్నారు. ఇంకా 378 పరుగుల వెనుకంజలో విండీస్ నిలిచింది. భారత బౌలర్లలో రవీంద్ర జడేజాకు మూడు వికెట్లు దక్కాయి. కుల్దీప్ యాదవ్ కు ఒక వికెట్ దక్కింది. అంతకుముందు తొలి ఇన్నింగ్సు ను 578-5 వద్ద భారత్ డిక్లేర్ చేసింది. జోమెల్ వర్రీకాన్ కు మూడు వికెట్లు దక్కాయి. రవీంద్ర జడేజా(3/98) తీన్మార్ బౌలింగ్తో రెండో రోజు ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్లో 43 ఓవర్లలో 4 వికెట్లకు 140 పరుగులు చేసింది. ఆ జట్టు ఇంకా 378 పరుగుల వెనుకంజలో ఉంది. ఓపెనర్లు త్యాగనరైన్ చంద్రపాల్(67 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్తో 34), జాన్ కాంప్బెల్(25 బంతుల్లో 2 ఫోర్లతో 10) మరోసారి నిరాశపర్చగా.. అలిక్ అథనాజే(84 బంతుల్లో 5 ఫోర్లతో 41), షైహోప్(46 బంతుల్లో 5 ఫోర్లతో 31 బ్యాటింగ్) పర్వాలేదనిపించారు. రోస్టన్ ఛేజ్(0) డకౌటవ్వగా.. టెవిన్ ఇమ్లాచ్(14 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. భారత బౌలర్లలో జడేజా మూడు వికెట్లు తీయగా.. కుల్దీప్ యాదవ్ ఒక వికెట్ పడగొట్టాడు. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్లో 134.2 ఓవర్లలో 5 వికెట్లకు 518 పరుగుల భారీ స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్(258 బంతుల్లో 22 ఫోర్లతో 175), శుభ్మన్ గిల్(196 బంతుల్లో 2 సిక్స్లతో 16 ఫోర్లతో 129 నాటౌట్) శతకాలతో చెలరేగారు. నితీష్ కుమార్ రెడ్డి(54 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్లతో 43), ధ్రువ్ జురెల్(79 బంతుల్లో 5 ఫోర్లతో 44), కేఎల్ రాహుల్(54 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్తో 38) హాఫ్ సెంచరీలు చేజార్చుకున్నారు. వెస్టిండీస్ బౌలర్లలో జొమెల్ వారికన్(3/98) మూడు వికెట్లు తీయగా.. రోస్టన్ ఛేజ్ ఓ వికెట్ పడగొట్టాడు. మూడో రోజు ఆట మ్యాచ్ గమనాన్ని నిర్దేశించనుంది. వెస్టిండీస్ బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకొని బ్యాటింగ్ చేస్తే.. మ్యాచ్ రసవత్తరంగా మారుతుంది. అలా కాకుండా పెవిలియన్ క్యూ కడితే భారత్ ఏకపక్ష విజయాన్నందుకోనుంది. రెండో రోజు ఆటలోనూ మూడు సెషన్లలో టీమిండియా ఆధిపత్యం చెలాయించింది. 318/2 ఓవర్నైట్ స్కోర్తో రెండో రోజు ఆటను ప్రారంభించిన టీమిండియాకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. రెండో ఓవర్లోనే అనవసర పరుగుకు ప్రయత్నించి యశస్వి జైస్వాల్ రనౌట్గా వెనుదిరిగాడు. శుభ్మన్ గిల్తో సమన్వయ లోపం కారణంగా అతను డబుల్ సెంచరీ



చేజార్చుకున్నాడు. దాంతో మూడో వికెట్కు నమోదైన 74 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి వచ్చిన నితీష్ కుమార్ రెడ్డితో కలిసి గిల్ ఇన్నింగ్స్ను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో గిల్ 95 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్లో నితీష్ కుమార్ రెడ్డి దూకుడుగా ఆడే ప్రయత్నంలో క్యాచ్ ఔట్గా వెనుదిరిగి హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. క్రీజులోకి ధ్రువ్ జురెల్ రాగా.. మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడిన గిల్ తొలి సెషన్ను ముగించాడు. దాంతో టీమిండియా 427/4 స్కోర్తో లంచ్ బ్రేక్కు వెళ్లింది.రెండో సెషన్లోనూ సాధికారికంగా బ్యాటింగ్ చేసిన గిల్.. 177 బంతుల్లో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ధ్రువ్ జురెల్ కూడా అతనికి అండగా నిలిచాడు. హాఫ్ సెంచరీ ముంగిట రోస్టన్ ఛేజ్ బౌలింగ్లో ధ్రువ్ జురెల్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. దాంతో ఐదో వికెట్కు నమోదైన 102 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ వెంటనే ఇండియా తమ తొలి ఇన్నింగ్స్ను డిక్లేర్ చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్.. భారత పేసర్లను ఆచితూచి ఆడింది. దాంతో జడేజాను బరిలోకి దింపిన గిల్ ఆశించిన ఫలితాన్ని రాబట్టాడు. ఓపెనర్ కాంప్బెల్ కొట్టిన షాట్ను షార్ట్ లెగ్ ఫీల్డర్ సాయి సుదర్శన్ అద్భుతంగా అందుకున్నాడు. ఈ క్యాచ్ పట్టే క్రమంలో అతని చేతికి గాయమైంది. క్రీజులోకి వచ్చిన అథనజేతో కలిసి చంద్రపాల్ ఆచితూచి ఆడాడు. దాంతో 26/1 స్కోర్తో విండీస్ టీబ్రేక్కు వెళ్లింది. ఆఖరి సెషన్లో విండీస్ ద్వయం సాధికారికంగా బ్యాటింగ్ చేసింది. ఓపికగా ఆడిన ఈ జోడీ వీలుచిక్కిన బంతిని బౌండరీకి తరలించింది. హాఫ్ సెంచరీ దిశగా సాగిన చంద్రపాల్ను జడేజా రాహుల్ సాయంతో క్యాచ్ ఔట్గా పెవిలియన్ చేర్చాడు. దాంతో రెండో వికెట్కు నమోదైన 66 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. షైహోప్తో కలిసి ఇన్నింగ్స్ను నడిపించిన అలిక్ అథనజే(41)ను కుల్దీప్ యాదవ్ క్యాచ్ ఔట్గా పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే రోస్టన్ ఛేజ్(0)ను జడేజా డకౌట్ చేశాడు. క్రీజులోకి వచ్చిన ఇమ్లాచ్తో కలిసి షైహోప్ మరో వికెట్ పడకుండా ఆచితూచి ఆడి రెండో రోజు ఆటను ముగించాడు.

# నఖ్వీ పై కఠిన చర్యలకు బీసీసీఐ రంగం సిద్ధం



ఆసియా కప్ 2025 ఫైనల్లో భారత్ విజయం సాధించిన తర్వాత, విజేతలకు ట్రోఫీ అందించే విషయంలో తలెత్తిన వివాదం మరింత ముదురుతోంది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మోసిన్ నఖ్వీ వ్యవహరించిన తీరుపై బీసీసీఐ తీవ్ర ఆగ్రహంతో ఉంది. ట్రోఫీని నఖ్వీ చేతుల మీదుగా తీసుకోడానికి భారత జట్టు నిరాకరించడంతో ఆయన ట్రోఫీని ఏసీసీ హెడ్క్వార్టర్స్లోనే ఉంచాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో నఖ్వీని ఐసీసీ బోర్డు ఆఫ్ డైరెక్టర్ పదవి నుంచి తొలగించేందుకు బీసీసీఐ బలమైన చర్యలు తీసుకోబోతోందని తెలుస్తోంది. ట్రోఫీని స్వయంగా తానే వచ్చి కెప్టెన్కు లేదా బీసీసీఐ ప్రతినిధులకు ఇస్తానని నఖ్వీ మొండిగా చెబుతున్నప్పటికీ, ఆసియా కప్కు పాకిస్థాన్ అధికారిక ఆతిథ్యం ఇచ్చింది కాబట్టి, విజేతగా నిలిచిన భారత్కు ట్రోఫీని తక్షణమే అప్పగించాల్సిందేనని బీసీసీఐ స్పష్టం చేస్తోంది. నఖ్వీ వివాదాస్పద వైఖరిపై బీసీసీఐ తీవ్రంగా స్పందించాలని నిర్ణయించుకున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. న్యూస్ ఏజెన్సీ పీటీఐ నివేదిక ప్రకారం.. బీసీసీఐ ఇప్పుడు నఖ్వీని మందలించాలని, ఐసీసీలోని బోర్డు ఆఫ్ డైరెక్టర్ పదవి నుంచి తొలగించాలని కూడా చూస్తోంది. ఈ టోర్నీకి పాకిస్థాన్ అధికారిక ఆతిథ్యం ఇచ్చింది కాబట్టి, నఖ్వీ స్వయంగా ట్రోఫీని ఇవ్వడానికి పట్టుబట్టడం లేదా బీసీసీఐకి పంపకుండా నిరాకరించడం సరైనది కాదని బీసీసీఐ భావిస్తోంది. బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా కూడా ఆసియా కప్ నఖ్వీ వ్యక్తిగత సొత్తు కాదని గట్టి కౌంటర్ ఇచ్చారు. నఖ్వీ ధోరణి ఇలాగే కొనసాగితే కఠిన చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఈ ఆసియా కప్ టోర్నీలో భారత్, పాకిస్థాన్ మధ్య శత్రుత్వం మ్యాచ్ల కంటే ఎక్కువగా చర్చనీయాంశమైంది. టోర్నీ మొదటి మ్యాచ్లోనే పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్తో షేక్ హ్యాండ్ ఇవ్వకుండా దూరం ఉండాలని ఐసీసీ మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ చెప్పారంటూ పీసీబీ ఆరోపించింది. గ్రూప్ %ూ% మ్యాచ్ సమయంలో తమ డిమాండ్స్ నెరవేర్చకపోతే యూఏఈతో జరగబోయే మ్యాచ్ను బాయ్కాట్ చేయాలని కూడా పాకిస్థాన్ ఆలోచించినట్లు నివేదికలు వచ్చాయి. సూపర్ 4, ఫైనల్ మ్యాచ్లలో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య వాగ్వాదాలు జరిగాయి. బీసీసీఐ, పీసీబీ ఫిర్యాదుల మేరకు ఐసీసీ ఆటగాళ్లకు జరిమానాలు కూడా విధించింది.

# భారీ మార్పులకు సిద్ధమవుతోన్న రాజస్థాన్ రాయల్స్

### సంజు శాంసన్ ను వదులుకునే అవకాశం!!



ఐపీఎల్ 2026 సీజన్ కోసం ఫ్రాంచైజీలు ఇప్పటి నుంచే తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఈ క్రమంలో గత సీజన్లో ఆశించిన స్థాయిలో రాణించలేని రాజస్థాన్ రాయల్స్ జట్టు భారీ మార్పులకు సిద్ధమవుతోంది. గత సీజన్లో తొమ్మిదో స్థానంలో నిలిచిన ఆర్ఆర్.. కొత్త కెప్టెన్, కొత్త ఆటగాళ్లతో బరిలోకి దిగాలని చూస్తోంది. ఈ మెగా ఆక్షన్ ముందు జట్టులో కీలకమైన ముగ్గురు ఆటగాళ్లను, ముఖ్యంగా ప్రస్తుత కెప్టెన్ సంజు శాంసన్ను కూడా విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. రాజస్థాన్ రాయల్స్లో జరగబోయే అతి పెద్ద మార్పులలో ఒకటి, జట్టు కెప్టెన్ సంజు శాంసన్ను విడుదల చేయడం. గత సీజన్లో జట్టు వైఫల్యం, శాంసన్ వ్యక్తిగత ప్రదర్శనపై ప్రభావం చూపింది. గత సీజన్లో గాయాలతో బాధపడిన సంజు కేవలం 9 మ్యాచ్లు మాత్రమే ఆడాడు. అంతేకాకుండా కెప్టెన్సీ ఒత్తిడి అతని బ్యాటింగ్పై ప్రభావం చూపింది. సంజు శాంసన్ తన ఐపీఎల్ కెరీర్ను 2013 లో రాజస్థాన్ రాయల్స్తోనే ప్రారంభించాడు. అతను ఐపీఎల్లో ఇప్పటివరకు చేసిన 4,704 పరుగులు రాజస్థాన్ తరఫున చేసినవే. అయినప్పటికీ, నిరంతర గాయాలు, కమాండింగ్ కెప్టెన్సీ చేయలేకపోవడం వంటి కారణాల వల్ల ఫ్రాంచైజీ అతనిని మెగా ఆక్షన్ ముందు విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. రాజస్థాన్ రాయల్స్ విడుదల చేయాలని యోచిస్తున్న మరో కీలక ఆటగాడు శ్రీలంక స్పిన్నర్ మహీష్ తీక్షణ. గత సీజన్లో తీక్షణను ఆర్ఆర్ జట్టు రూ. 4.40 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే, అతని ప్రదర్శన అంచనాలను అందుకోలేకపోయింది. అతను ఆడిన సీజన్ మొత్తంలో కేవలం 11 వికెట్లు మాత్రమే తీయగలిగాడు. అంతేకాకుండా, అతని ఎకానమీ రేటు 9.26 గా, బౌలింగ్ సగటు 37 కంటే ఎక్కువగా ఉండటం తీవ్ర నిరాశ కలిగించింది. జట్టు మేనేజ్మెంట్ ఇప్పుడు పవర్ ప్లే, డెత్ ఓవర్లలో ప్రభావం చూపగల మంచి స్పెషలిస్ట్ స్పిన్నర్ కోసం చూస్తోంది. ఈ నేపథ్యంలో తీక్షణను విడుదల చేసి మెరుగైన స్పిన్ ఆప్షన్లను పరిశీలించే అవకాశం ఉంది. వెస్టిండీస్కు చెందిన విధ్వంసకర బ్యాట్స్మెన్ షిమ్రాన్ హెట్మయర్ను కూడా విడుదల చేసే అవకాశం ఉంది. హెట్మయర్ గత కొన్ని సీజన్లుగా తన స్థాయికి తగ్గట్టుగా రాణించలేకపోతున్నాడు. అతన్ని రూ. 11 కోట్లకు రిటైన్ చేసుకున్నారు. అయితే, 2025 సీజన్లో అతను 14 మ్యాచ్లలో కేవలం 239 పరుగులు మాత్రమే చేశాడు. జట్టుకు ముఖ్యమైన ఫినిషర్ పాత్రలో అతను పూర్తిగా విఫలమయ్యాడు. 2022 సీజన్ తర్వాత హెట్మయెర్ ఏ సీజన్లోనూ 300 పరుగుల మార్కును చేరుకోలేకపోయాడు. అందుకే, రాజస్థాన్ రాయల్స్ ఇప్పుడు అతన్ని విడుదల చేసి, ఆక్షన్ ద్వారా కొత్త ఫినిషర్ లేదా విదేశీ పవర్ హిట్టర్ను తీసుకోవాలని ప్రణాళిక వేస్తోంది. రాజస్థాన్ రాయల్స్ 2026 సీజన్కు పూర్తిగా కొత్త వ్యూహం, కొత్త ముఖాలతో ముందుకు రావాలని నిర్ణయించుకుంది. జట్టును బలోపేతం చేయడానికి అనుభవజ్ఞులైన ఆల్రౌండర్లు, స్పెషలిస్ట్ బ్యాట్స్మెన్లపై దృష్టి సారించనుంది. ఈ మెగా ఆక్షన్ ముందు ఈ ముగ్గురు కీలక ఆటగాళ్లను విడుదల చేయడం ద్వారా, ఆర్ఆర్ వచ్చే సీజన్ను కొత్త కెప్టెన్, కొత్త ఆలోచనలతో ప్రారంభించడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.

# టెస్ట్ క్రికెట్లో టీమిండియా చరిత్ర


### వరుసగా ఐదు వికెట్లకు 50 ప్లస్ భాగస్వామ్యాలు

### 65 ఏళ్లలో ఇదే తొలిసారి!


టెస్ట్ క్రికెట్లో టీమిండియా చరిత్ర సృష్టించింది. 65 ఏళ్ల తర్వాత వెస్టిండీస్పై వరుసగా ఐదు వికెట్లకు 50 ప్లస్ భాగస్వామ్యాలను నమోదు చేసిన జట్టుగా భారత్ అరుదైన రికార్డ్ నమోదు చేసింది. వెస్టిండీస్తో న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్ తొలి ఇన్నింగ్స్లో టీమిండియా ఈ ఫీట్ సాధించింది. ఈ ఇన్నింగ్స్లో టీమిండియా టాప్-5 బ్యాటర్లు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, శుభ్మన్ గిల్, నితీష్ కుమార్ రెడ్డి, ధృవ్ జురెల్ వరుసగా ఐదు వికెట్లకు 50ం రన్స్ పార్ట్నర్షిప్స్ అందించారు. తొలి వికెట్కు రాహుల్-జైస్వాల్ 58, రెండో వికెట్కు జైస్వాల్-సాయి సుదర్శన్ 193, మూడో వికెట్కు జైస్వాల్-శుభ్మన్ గిల్ 69, నాలుగో వికెట్కు శుభ్మన్ గిల్-నితీష్ కుమార్ రెడ్డి 91, ఐదో వికెట్కు శుభ్మన్ గిల్-ధ్రువ్ జురెల్ 102 పరుగుల భాగస్వామ్యాలను నమోదు చేశారు. 1960 తర్వాత వెస్టిండీస్ జట్టుపై ఒక టీమ్ వరుసగా ఐదు వికెట్లకు 50 ప్లస్ రన్స్ పార్ట్నర్షిప్స్ నమోదవ్వడం ఇదే తొలిసారి. గతంలో ఈ రికార్డ్ను వెస్టిండీస్పై ఆస్ట్రేలియా నమోదు చేసింది. 1960లో బ్రిస్బేన్ వేదికగా జరిగిన గబ్బా టెస్ట్లో ఆసీస్ ఈ ఫీట్ సాధించింది. 93 ఏళ్ల భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో టీమిండియా ఈ ఫీట్ సాధించడం మూడో సారి. 1993లో తొలిసారి, 2023లో ఆస్ట్రేలియాపై రెండో సారి టీమిండియా వరుసగా 5 వికెట్లకు 50 ప్లస్ రన్స్ భాగస్వామ్యాలను నమోదు చేసింది. తాజాగా మరోసారి ఈ ఫీట్ అందుకుంది.

# కోచ్గా న్యూజిలాండ్ చేతిలో పరాజయాన్ని మరిచిపోలేను

### టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్



టీమిండియా హెడ్ కోచ్గా సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో ఎదురైన సిరీస్ పరాజయాన్ని తాను మరిచిపోలేనని గౌతమ్ గంభీర్ తెలిపాడు. జీవితాంతం ఈ ఓటమి తనను వెంటాడుతుందని చెప్పాడు. ఈ పరాజయాన్ని మరిచిపోయే ప్రయత్నం కూడా చేయనని, తమ ఆటగాళ్లకు పదే పదే గుర్తు చేస్తానని కూడా చెప్పాడు. రాహుల్ ద్రవిడ్ అనంతరం టీమిండియా హెడ్ కోచ్గా బాధ్యతలు చేపట్టిన గౌతమ్ గంభీర్.. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీతో పాటు ఆసియా కప్ 2025 టోర్నీల్లో టీమిండియాను విజేతగా నిలిపాడు. కానీ సుదీర్ఘ ఫార్మాట్లో మాత్రం గంభీర్ హెడ్ కోచ్గా ఘోర పరాజయాలను చవిచూసాడు. అతని పర్యవేక్షణలో టీమిండియా సొంతగడ్డపై న్యూజిలాండ్తో మూడు టెస్ట్ల సిరీస్లో క్లీన్ స్వీప్ అయ్యింది. 93 ఏళ్ల భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే సొంతగడ్డపై క్లీన్ స్వీప్ కావడం ఇదే తొలిసారి. ఈ పరాజయంతో టీమిండియా డబ్ల్యూటీసీ 2025 ఫైనల్కు కూడా అర్హత సాధించలేకపోయింది. తాజాగా ఈ పరాజయంపై స్పందించిన గంభీర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వెస్టిండీస్తో రెండో టెస్ట్ సందర్భంగా రెండో రోజు ఆట లంచ్ బ్రేక్లో అధికారిక బ్రాడ్కాస్టర్తో మాట్లాడిన గంభీర్.. డబ్ల్యూటీసీ ఛాంపియన్గా నిలవాలంటే విదేశాల్లో కూడా రాణించాలని చెప్పాడు. 'వరల్డ్ బెస్ట్ టెస్ట్ టీమ్గా ఎదగాలంటే సొంతగడ్డపైనే కాకుండా విదేశాల్లోనూ ఆధిపత్యం కనబర్చాలనేది నా ఆలోచన. ఈ యువ జట్టు ఆ ఆలోచనను అమలు చేసింది. అత్యంత కఠినమైన ఇంగ్లండ్ పర్యటనలో పెద్దగా అనుభవం లేని మా యువ జట్టు అద్భుత ప్రదర్శన కనబర్చింది. ఫలితం ఎలా ఉన్నా.. ప్రతీ రోజు మా ఆటగాళ్లు పోరాడిన తీరు అద్భుతం. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్షిప్ ఫైనల్కు అర్హత సాధించాలంటే సొంతగడ్డపై ఆధిపత్యం చెలాయిస్తే సరిపోతుందనే సిద్ధాంతాన్ని నేను నమ్మను. ఎందుకంటే సొంతగడ్డపై మాత్రమే రాణిస్తే.. వరల్ట్ టెస్ట్ ఛాంపియన్గా నిలిచేందుకు ఏ మాత్రం అర్హులు కారు.కోచ్గా న్యూజిలాండ్ చేతిలో ఎదురైన పరాజయాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. ఆ ఓటమిని మర్చిపోకూడదు కూడా. ఈ ఓటమిని మా ఆటగాళ్లకు పదే పదే గుర్తు చేయాలి. ఓటమిని మరిచి ముందుకు వెళ్లడం ముఖ్యమే. కానీ కొన్నిసార్లు గతాన్ని కూడా గుర్తుంచుకోవాలి. ఎందుకంటే గతాన్ని మర్చిపోతే తేలికగా తీసుకోవడం మొదలుపెడుతారు. దేనిని కూడా తేలికాగా తీసుకోకూడదు. ఎందుకంటే న్యూజిలాండ్ను మేం సునాయసంగా ఓడిస్తామని అంతా అనుకున్నారు. కానీ ఫలితం మరోలా వచ్చింది. ఇదే వాస్తవం. ఆట అంటేనే ఇలా ఉంటుంది.నన్ను అడిగితే న్యూజిలాండ్ చేతిలో ఎదురైన పరాజయాన్ని డ్రెస్సింగ్ రూమ్లో పదే పదే మా ఆటగాళ్లకు గుర్తు చేస్తూ ఉండాలని చెబుతాను. అందేకే మేం ప్రత్యర్థిని ఇంచ్ కూడా తేలికగా తీసుకోం. ప్రతికూల పరిస్థితుల్లో శుభ్మన్ గిల్ ఎలా రియాక్ట్ అవుతాడో అని నాకు చూడాలని ఉంది. అతనికి నేను ఎప్పుడూ అండగా ఉంటాను. అతనిపై ఈగ కూడా వాలనివ్వను. విమర్శలను స్వీకరించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. అతను సరైన డైరెక్షన్లో నడిచే వరకు అండగా ఉంటాను.'అని గౌతమ్ గంభీర్ చెప్పుకొచ్చాడు.



# లక్‌కోసం ఎదురు చూస్తున్న కృతిశెట్టి

తొలి సినిమాతోనే తెలుగులో గ్రాండ్ సక్సెస్ అందుకున్న భామల్లో ఒకరు కృతిశెట్టి. ఉప్పెన సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. అద్భుతమైన నటనతో కుర్రకారు మనసు దోచేసిన కృతిశెట్టి ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంది. కానీ ఆ తర్వాత చేసిన సినిమాలు మాత్రం కృతిశెట్టికి నిరాశనే మిగిల్చాయని చెప్పాలి. కృతిశెట్టి హీరోయిన్‌గా నటించిన కస్టడీ, మనమే, ది వారియర్, మాచెర్ల నియోజకవర్గం సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఈ వరుస ఫెయిల్యూర్స్ టాలీవుడ్‌లో కృతిశెట్టి ప్రయాణంపై ప్రభావం చూపించాయి. అయితే ఇక చేసేదేమి లేక తమిళంలో తన లక్‌ను పరీక్షించుకోవాలనుకున్నకృతిశెట్టి అక్కడ మూడు సినిమాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాపులర్ యాక్టర్లతో సినిమాలు చేసి.. షూటింగ్స్ పూర్తి చేసినా పలు కారణాల వల్ల ఆలస్యమవుతూ వచ్చాయి. తీవ్ర నిరాశలో ఉ ండిపోయిన కృతిశెట్టి అభిమానుల కోసం వరుసగా ఆ సినిమాలు విడుదలకు రెడీ అయ్యాయి. పై మూడు సినిమాలు ఒకేసారి ఒకే నెలలో విడుదలకు ముస్తాబవుతున్నాయి. ఈ మూడు ప్రాజెక్టులు కూడా డిసెంబర్ నెలలోనే రిలీజ్ కాబోతుండటం విశేషం. కృతిశెట్టి కార్తీతో కలిసి నటిస్తున్న వా వాథియార్, ప్రదీప్ రంగనాథన్ లవ్ ఇన్సూరెన్స్, రవిమోహన్ సినిమాలు డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. చాలా కాలంగా సరైన బ్రేక్ ఎదురుచూస్తున్న కృతిశెట్టికి ఈ డిసెంబర్ అయినా కలిసి రావాలని కోరుకుంటున్నారు అభిమానులు, ఫాలోవర్లు.

# రౌడీ జనార్ధన్‌గా వస్తున్న విజయ్ దేవరకొండ



వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు విజయ్ దేవరకొండ.. ఈ హీరో మరో చిత్రం 'రౌడీ జనార్దన్' ప్రారంభమైంది. రవి కిరణ్ కోలా దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో విజయ్ సరసన కీర్తి సురేశ్ నటిస్తున్నారు. శనివారం పూజా కార్యక్రమాలతో ఈ సినిమా ప్రారంభమైంది. నిర్మాత అల్లు అరవింద్ కల్‌ఆప్ కొట్టారు. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట షేర్ అవుతున్నాయి. ఈ కార్యక్రమానికి నిర్మాతలు దిల్ రాజు, అల్లు అరవింద్ హాజరయ్యారు. 'రాజావారు రాణిగారు' సినిమాతో తెలుగు ప్రేక్షకులను మెప్పించిన దర్శకుడే రవికిరణ్ కోలా. తొలి మూవీకి భిన్నంగా ఈసారి విజయ్‌తో యాక్షన్‌కు ప్రాధాన్యం ఉన్న కథను తెరకెక్కించనున్నారు. ఈనెల 16 నుంచి ముంబయిలో ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. మొదటిసారి విజయ్ సరసన కీర్తి సురేశ్ కనిపించనుండడంతో దీనిపై ఆసక్తి ఏర్పడింది.

# సిద్ధూ సినిమా.. ఓ రొమాంటిక్ డ్రామా

## హీరోయిన్ శ్రీనిధిశెట్టి



కేజీఎఫ్ సినిమాతో హీరోయిన్‌గా బ్లాక్ బస్టర్ హిట్టందుకుంది శ్రీనిధి శెట్టి. తెలుగులో నానితో హిట్ 3లో కలిసి నటించింది. ఈ భామ ప్రస్తుతం సిద్ధుజొన్నలగడ్డతో రొమాంటిక్ ఎంటర్‌టైనర్ తెలుసు కదా సినిమాలో నటిస్తుంది. ఈ మూవీ అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా గురించి ఆసక్తికర విషయాలు షేర్ చేసుకుంది శ్రీనిధిశెట్టి. చిట్ చాట్ సెషన్‌లో శ్రీనిధి శెట్టి మాట్లాడుతూ.. కేజీఎఫ్, హిట్ 3 లాంటి వయొలెన్స్, రక్తపాతం చుట్టూ తిరిగే సినిమాల తర్వాత సున్నిత భావోద్వేగాలతో సాగే సినిమా ఇది. ఈ మూవీ నాకు ఉత్తేజాన్ని కలిగించే మార్పులాంటిది. ఈ చిత్రాన్ని ప్రతీ ఒక్కరూ ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నానంది. తెలుసు కదా ప్రేమ, ఎమోషన్, నవ్వులు, అందమైన పాటలతో సాగే కమర్షియల్ సినిమా. ఈ సినిమా చూసిన తర్వాత మూవీ లవర్స్ ఒక అందమైన రొమాంటిక్ డ్రామాను చూసినట్టు ఫీల్ అవుతారంది శ్రీనిధి శెట్టి . సినిమాకు పనిచేయడం గురించి మాట్లాడుతూ.. నాకు డైరెక్టర్ నీరజ కోన, సిద్ధు, రాశీ ఖన్నాతో కలిసి నటించే అద్భుతమైన సమయం దొరికింది. నీరజ కోన చాలా సపోర్ట్‌గా నిలిచే వ్యక్తి. ప్రేక్షకులు ఖచ్చితంగా సిద్ధు పాత్రతో ప్రేమలో పడిపోతారు. అతడికి ప్రతీ విభాగంలో అద్భుతమైన ప్రావీణ్యం ఉంది. రాశీఖన్నా చాలా క్రమశిక్షణతో ఉండే వ్యక్తి అని చెప్పుకొచ్చింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి పనిచేయడం గొప్పగా భావిస్తున్నానంది. సినిమాల పట్ల ఎంతో ప్యాషన్ ఉన్న నిర్మాతలతో కలిసి పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానంది శ్రీనిధిశెట్టి.

## మళ్లీ అదే తప్పు చేస్తున్న శ్రీ లీల.. టెన్షన్ లో ఫ్యాన్స్!

శ్రీ లీల.. టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో యంగ్ హీరోయిన్ గా పేరు సొంతం చేసుకున్న ఈమె.. ఇప్పుడు భాషతో సంబంధం లేకుండా వరుస అవకాశాలు అందుకుంటూ బిజీగా మారిపోయింది. వరుస అవకాశాలు అయితే వస్తున్నాయి కానీ సక్సెస్ రేట్ మాత్రం నిల్ అని చెప్పడంలో సందేహం లేదు. సాధారణంగా ఒకసారి దెబ్బతిన్న తర్వాత మరొకసారి కచ్చితంగా ఎవరైనా సరే కళ్ళు తెరుచుకుంటారు. కానీ శ్రీ లీలా మాత్రం మళ్లీ అదే తప్పు చేస్తూ అభిమానులను టెన్షన్లో పెట్టేసింది. మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం..

కే రాఘవేంద్రరావు దర్శకత్వ పర్యవేక్షణలో పెళ్లి సంద%ణ% అనే సినిమాతో హీరోయిన్గా తెలుగు తెరకు పరిచయమైంది శ్రీ లీల.. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలోనే ధమాకా సినిమాతో బ్లాక్ మాస్టర్ విజయాన్ని అందుకొని.. స్టార్ హీరోయిన్గా పేరు సొంతం చేసుకుంది. ఎంత వేగంగా అయితే స్టార్ స్టేటస్ లభించిందో.. అంతే స్పీడుగా బ్యాక్ టు బ్యాక్ డిజాస్టర్ సినిమాలు ఆమె ఖాతాలో పడ్డాయి. దీంతో శ్రీ లీల స్టోరీ సెలక్షన్ మీద, ఆమె యాక్టింగ్ మీద , క్యారెక్టర్ మీద పలు రకాల సెటైర్లు కూడా వినిపించాయి. ధమాకా సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న ఈమెకు వరుసగా అవకాశాలు తలుపుతట్టాయి. అలా రామ్ పోతినేని తో స్కంద, బాలకృష్ణ హీరోగా నటించిన భగవంతు కేసరి సినిమాలో బాలయ్యకు కూతురుగా, మెగా మేనల్లుడు వైష్ణవ్ తేజ్ తో ఆదికేశవ, నితిన్ తో ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్, రాబిన్ హుడ్, మహేష్ బాబుతో గుంటూరు కారం, గాలి కిరీటి రెడ్డితో జూనియర్ ఇలా దాదాపు బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఇందులో భగవంత్ కేసరి, గుంటూరు కారం సినిమాలు మంచి విజయాన్ని అందుకున్నా.. ఈమె కెరియర్ కి పెద్దగా ఇంపాక్ట్ చూపించలేదు. చివరిగా వచ్చిన జూనియర్ సినిమాతో నైనా సక్సెస్ అందుకుంటుంది అని అభిమానులు ఎంతగానో ఎదురు చూశారు. ఇందులో 'వైరల్ వయ్యారి' పాట ఈమె నటనను ఊహించని రేంజ్ కు తీసుకెళ్లింది. కానీ ఈ సినిమా కూడా పెద్దగా ఈమెకు వర్కౌట్ కాలేదు. పైగా పుష్ప 2 లో స్పెషల్ సాంగ్ చేసింది. ఇప్పుడేమో రవితేజ తో మాస్ జాతర అంటూ ప్రేక్షకుల ముందుకు వస్తోంది. కానీ ఈ సినిమా హడావిడి కూడా పెద్దగా కనిపించడం లేదు.

# మీతో స్క్రీన్ షేర్ చేసుకోవడం అదృష్టం

## బిగ్‌బి అమితాబ్‌కు బర్త్‌డే విషెస్ చెప్పిన ప్రభాస్





బాలీవుడ్ సూపర్ స్టార్ హీరో అమితాబ్ బచ్చన్ అక్టోబర్ 11న అంటే..శనివారం 83వ ఏడాదిలోకి అడుగు పెట్టారు. ఈ సందర్భంగా అతడికి సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుఉన్నాయి. టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా బిగ్ బీకి బర్త్ డే విషెస్ తెలిపారు. ఈ పోస్టులో 'మీకు దగ్గర ఉండి మీ వర్క్‌ను చూడడం, మీతో కలిసి స్క్రీన్ పంచుకోవడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను.. మీరు ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలి అంటూ రెబల్ స్టార్ ప్రభాస్ విషెస్ చేశారు. ఇక, వీరిద్దరి కాంబినేషన్‌లో గతేడాది విడుదలైన 'కల్కి 2898 ఏడీ' థియేటర్లలో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. భారీ బ్జడెట్‌తో తెరకెక్కిన ఈ మూవీ రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో అమితాబ్ బచ్చన్.. అశ్వత్థామగా, ప్రభాస్ భైరవగా నటించారు. ప్రస్తుతం దీని సీక్వెల్ పనులు కొనసాగుతున్నాయి. అయితే, ప్రస్తుతం 'కల్కి2'కు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది. ఈ భారీ ప్రాజెక్ట్ నుంచి ఇప్పటికే దీపిక పదుకొణెను వైజంతి మూవీస్ తొలగించిన విషయం తెలిసిందే. దీంతో కల్కి2 సీక్వెల్‌లో ఆమె పాత్రను ఎవరు పోషిస్తారా అనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ఈ పాత్రలో బాలీవుడ్ క్వీన్ అలియా భట్ నటించనున్నట్లు న్యూస్ వస్తుంది. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన కోసం అభిమానులు వేచి చూస్తున్నారు.

# ఓ భారీ సినిమా కోసం కష్టపడుతున్నా

## అల్లుతో సినిమాపై అట్లీ కామెంట్స్



అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా గురించి అట్లీ ఓ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రేక్షకులు ఆశ్చర్యపోయే ప్రపంచాన్ని సృష్టించనున్నట్లు తెలిపారు. తాజాగా బెంగళూర్‌లో జరిగిన పికిల్‌బాల్ టోర్నమెంట్‌కు అట్లీ అతిథిగా హాజరయ్యారు. ఇందులో ఈ మూవీ గురించి మాట్లాడారు. 'ఏదైనా ఒక్క ఆలోచనతోనే ప్రారంభమవుతుంది. ఈ సినిమాతో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వడానికి మేం ప్రయత్నిస్తున్నాం. ఆడియన్స్ ఆశ్చర్యపోయేలా కొత్త ప్రపంచాన్ని సృష్టించనున్నాం. దేవుడు మా ప్రయాణంలో ప్రతి అడుగులోనూ తోడున్నాడు. ఆయన దయ వల్ల అంతా మేం అనుకున్నట్లే జరుగుతుందని ఆశిస్తున్నా. ఇంత భారీ ప్రాజెక్ట్‌ను రూపొందించడం రిస్క్‌గా అనుకోవడం లేదు. నేను దీన్ని ఎంజాయ్ చేస్తున్నా మరి కొన్ని నెలల్లో మీరు దీన్ని ఆస్వాదిస్తారని అట్లీ తెలిపారు. ఇక తాజాగా వచ్చిన 'కాంతార చాప్టర్ 1'పై అట్లీ ప్రశంసలు కురిపించారు. అదో అద్భుతమన్నారు. 'కాంతార 1'ను నేను మొదటి రోజు చూశాను. విదేశాల్లో ఉండడంతో థియేటర్‌కు వెళ్లడం కోసం దాదాపు రెండున్నర గంటలు డ్రైవ్ చేసుకుంటూ వెళ్లాను. సినిమా చూడగానే రిషబ్‌కు ఫోన్ చేసి అభినందించా. నేను చాలా గౌరవించే వ్యక్తుల్లో రిషబ్ ఒకరు. నాకు మంచి స్నేహితుడు. ఇలాంటి సినిమాను రూపొందించడం ఎంత కష్టమో ఒక దర్శకుడిగా నాకు తెలుసు. రిషబ్ ఎంతోమందికి స్ఫూర్తి. ఆయన ఈ సినిమాతో మరో జాతీయ అవార్డు గెలుచుకోవాలని ఆశిస్తున్నానని అట్లీ తెలిపారు.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463